# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 26-9-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 52 | పేజీలు 8 | వెల: రూ.1/-


## వేణుమాధవ్ మృతి పట్ల మంత్రి దిగ్భ్రాంతి

హైదరాబాద్,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): ప్రముఖ సినీ హాస్య నటుడు వేణుమాధవ్ కాలేయ సంబంధిత వ్యాధితో మరణించారు. వేణుమాధవ్ మరణం పట్ల తెలంగాణ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వేణుమాధవ్ మరణవార్త నన్ను కలిచివేసింది. వెండితెరపై నవ్వులు పూయించిన హాస్యతార మరణం సినీ ఇండస్ట్రీక్రి, తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అని మంత్రి అన్నారు. వేణు ఎన్నో సవాళ్లను అధిగమించి ఉన్నత స్థానానికి ఎదిగారని మంత్రి గుర్తు చేసుకున్నారు. సినీ వినీలాకాశంలో విహరించిన మేటి నటుడు మా జిల్లా వాసుడు కావడం మాకెంతో గర్వకారణమని ఆయన అన్నారు. కళామతల్లి ఒడిలో ఒదిగిపోయిన వేణు ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపిన మంత్రి ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సినీనటుడు వేణుమాధవ్ కన్నుమూత



- కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మృతి
- పలు చిత్రాలతో ప్రేక్షకుల ఆదరణ పొందిన వేణుమాదవ్
- 'సంప్రదాయం' చిత్రంతో వెండితెరకు పరిచయం
- 400 చిత్రాలకుపైగా నటన
- పలువురు సినీ ప్రముఖులు నివాళి

హైదరాబాద్; సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ) : ప్రముఖ టాలీవుడ్ కమేడియన్ వేణుమాధవ్ కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. దీంతోపాటుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన వేణుమాదవ్‌ను మంగళవారం కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం యశోద హాస్పిటల్‌లో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ సాయంతో.. వేణు

మాధవ్‌కి వైద్యులు చికిత్స అందించారు. అయినా ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో బుధవారం మధ్యాహ్నం కన్నుమూశారు. మధ్యాహ్నం 12 గంటల 20 నిమిషాలకు వేణుమాధవ్ మృతిచెందినట్టు ఆయన సోదరుడు గోపాలకృష్ణ వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలకు కాప్రాలోని హెచ్‌బీ కాలనీ మంగాపురంలో ఉన్న ఇంటికి వేణుమాధవ్ మృతదేహాన్ని తీసుకెళ్లారు. వేణుమాధవ్ 400కుపైగా చిత్రాల్లో నటించారు.

పలు హిట్ చిత్రాల్లో నటించిన వేణు మాధవ్.. అనతికాలంలోనే మంచి పేరు సంపాదించారు. కమెడియన్స్‌లో తనకంటూ.. ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

మిమిక్రీ కళాకారుడిగా కెరీర్‌ను ప్రారంభించిన వేణు మాధవ్.. ఎస్వీ కృష్ణా రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'సంప్రదాయం' చిత్రంతో వెండితెరకు పరిచయం అయ్యారు. ఆ తర్వాత చిన్న చిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. పవన్ కళ్యాణ్ హీరోగా వచ్చిన 'తొలిప్రేమ' సినిమాతో.. మంచి గుర్తింపు తెచ్చుకున్నారు వేణు మాధవ్.

### అంచెలంచెలుగా ఎదుగుతూ..

వేణుమాధవ్ మిమిక్రీ ఆర్టిస్ట్ గా కెరియర్ ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. వేణుమాధవ్ స్వస్థలం సూర్యపేట జిల్లా కోదాడ. 1968 సెప్టెంబర్ 28న ఆయన జన్మించారు. భార్య శ్రీవాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వేణుమాదవ్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనూ పనిచేశారు. సీనియర్ ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఎన్టీఆర్ భవన్‌లో పలు విభాగాల్లో పనిచేశారు. అనంతరం మిమిక్రీ ఆర్టిస్టుగా కెరియర్‌ను ప్రారంభించారు. తెలుగు ప్రేక్షకులు మెచ్చిన హాస్యనటుడిగా ఎదిగారు. ఎస్వి కృష్ణారెడ్డి దర్శకత్వంలో సంప్రదాయం సినిమాతో సినీరంగంలోకి ప్రవేశించారు. దాదాపు టాలీవుడ్‌లోని అగ్రకథానాయకులతో వేణుమాధవ్ పనిచేశారు. పలు సినిమాల్లో హీరోగా కూడా పనిచేశారు. గతకొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న వేణుమాధవ్ రాజకీయాల్లోనూ కాలుమోపారు. రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించనప్పటికీ నంద్యాల ఉపఎన్నికల్లో టీడీపీ తరఫున ప్రచారం చేసి వార్తల్లో నిలిచారు. గతేడాది జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రయత్నించారు.

కానీ, ఆయన నామినేషన్‌ను ఎన్నికల అధికారి తిరస్కరించడంతో కుదరలేదు. అప్పటికి వేణుమాధవ్ ఆరోగ్యంగానే ఉన్నారు. అయితే, గతకొద్ది నెలలుగా వేణుమాధవ్ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు.

దీనికి తోడు ఇటీవల కిడ్నీ సమస్య కూడా రావడంతో ఈనెల 6న కుటుంబసభ్యులు ఆయన్ని సికింద్రాబాద్‌లోని యశోద హాస్పటిల్‌లో చేర్చారు. అప్పటి నుంచి ఆయనకు డాక్టర్లు డయాలసిస్ చేస్తున్నారు. అయితే, మంగళవారం వేణుమాధవ్ ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆయన్ని ఐసీయూలోకి మార్చారు. వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. అయినప్పటికీ ఆయన్ని డాక్టర్లు కాపాడలేకపోయారు. వేణుమాధవ్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

# ఫుట్‌బోర్డు ప్రయాణీకులకు పోలీస్ కమిషనర్ కౌన్సెలింగ్

హైదరాబాద్, సెప్టెంబర్25 (ఆర్ఎన్ఎ): ఆర్టీసీ బస్సు ఫుట్‌బోర్డు ప్రయాణికులకు రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ కౌన్సిలింగ్ చేశారు. ఎల్‌బీనగర్ క్రాస్‌రోడ్డులో ఈ ఉదయం విపరీత రద్దీతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును సీపీ గమనించి ఆపారు. ఫుట్‌బోర్డుపై ప్రమాదకర రీతిలో ప్రయాణిస్తున్న పలువురి ప్రయాణికులను, విద్యార్థులను బస్సు నుంచి దింపేశారు. ఇటువంటి చర్యల వల్ల ప్రమాదాలు ఏ విధంగా జరుగుత ున్నవో వారికి వివరించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇంత పెద్ద సంఖ్యలో ప్రయాణికులను అనుమతించొద్దని డ్రైవర్‌కు సూచించారు.

# హైదరాబాద్‌లో రికార్డు స్థాయిలో వర్షం

## వందేళ్ల తరువాత కుండపోత వర్షం

హైదరాబాద్,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ కురిసిన కుంభవృష్టి నికి హైదరాబాద్ నగరం వణికిపోయింది. ఎనిమిది నుంచి తొమ్మిది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. 101 ఏళ్ల తరువాత కుండపోత వర్షం పడటంతో నాలాలు పొంగిపొర్లాయి. రహదారులు జలంతో నిండిపోయాయి. లోతట్టు ప్రాంతాలు మునిగాయి. జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. కిలోమీటర్ల మేర వాహనాలు జామ్ అయ్యాయి. రోడ్లపై నిలిచిన నీటిలో ద్విచక్రవాహనాలు మునిగిపోగా, కార్లు అద్దాల వరకు మునిగాయి.

1918 డిసెంబర్ తర్వాత హైదరాబాద్‌లో మళ్లీ ఈ స్థాయిలో వర్షం కురవడం ఇదే తొలిసారి. నిన్న రాత్రి 11 గంటల వరకు సికింద్రాబాద్ తిరుమలగిరిలో అత్యధికంగా 12.1, ఉప్పల్‌లో 12 సెం.మీల వర్షం కురిసింది. అలాగే అల్వాల్, కాప్రా, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, జూబ్లీహిల్స్, యూసుఫ్ గూడ, మెహిదీపట్నం, చార్మినార్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, ఖైరతాబాద్, గోషావ ుహల్, అంబర్‌పేట్, బేగంపేట్, శేరిలింగంపల్లి, కుత్బుల ాపూర్, ముసాపేట్, ఉప్పల్ ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. మరోవైపు నాచారం పోలీస్ స్టేషన్, సికింద్రాబాద్ లాలాగూడ రైల్వే ఆస్పత్రిలోని ఎమ్జ్గం÷న్సీ వార్డులోకి కూడా వర్షపు నీరు ప్రవేశించింది. జీహెచ్‌ఎంసీ రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగి, సహాయక చర్యలు చేపడుతోందని నగర మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. నగరంలో సహాయక చర్యలను పర్యవేక్షించిన ఆయన... ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# చిన్నారిని కొట్టిన తల్లికి జైలు శిక్ష

హైదరాబాద్,సెప్టెంబర్25 (ఆర్ఎన్ఎ) : 17 నెలల చిన్నారిని కొట్టిన తల్లికి మల్కాజిగిరి కోర్టు ఏడాదిన్నర జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళ్లితే.. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాధికా చౌరస్తాలో 2016 డిసెంబర్ 1న రాత్రి జయ, అజయ్, లక్ష్మిలు ముగ్గురు కలిసి మద్యం సేవించి గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఏడాదిన్నర కూతురు చిన్నారిని జయ విచక్షణ రహితంగా కొట్టగా.. విషయం తెలుసుకున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పానుగంటి సతీశ్ ముగ్గురిపై కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణలో దోషిగా తేలిన చిన్నారి తల్లి జయకు న్యాయస్థానం ఏడాదిన్నర పాటు జైలు శిక్ష విధించింది. మిగతా ఇద్దరికి 3 నెలల పాటు శిక్ష విధించింది.

### ప్రజాస్వామ్య వ్యవస్థ..

# నిజమైన సత్తాఏంటో గాంధీ ఆనాడే చెప్పారు

- గాంధీ భారతీయుడైనా.. సిద్ధాంతాలు భారత్‌కే పరిమితంకాలేదు
- మెరుగైన సమాజం నిర్మించడంలో గాంధీ చూపిన మార్గం స్ఫూర్తివంతం

– ఐరాసలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

న్యూయార్క్, సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ) : ప్రజాస్వామ్య వ్యవస్థ నిజమైన సత్తా ఏంటో గాంధీ ఆనాడే చెప్పారని, గాంధీ భారతీయుడైనా ఆయన సిద్ధాంతాలు భారత్‌కే పరిమితం కాలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితిలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. గాంధీకి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని ఐరాస రూపొందించిన ప్రత్యేక స్టాంపును దేశాధినేతల సమక్షంలో ప్రధాని ఆవిష్కరించారు. అనంతరం 'సమకాలీన ప్రపంచంలో గాంధీ సిద్ధాంతాల ఔచిత్యం' ఇతివృత్తంతో జరిగిన కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. గాంధీపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినందుకు ఐరాసకు ధన్యవాదాలు తెలిపారు. గాంధీ భారతీయుడైనప్పటికీ.. ఆయన సిద్ధాంతాలు భారత్‌కు మాత్రమే పరిమితం కాలేదన్నారు. ఈరోజు ఇక్కడ జరుగుతున్న ఈ వేడుకే అందుకు నిదర్శనమన్నారు. గాంధీతో పరిచయం లేనివారు సైతం ఆయన జీవితంతో ప్రభావితం అయ్యారని, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ లేదా నెల్సన్ మండేలా.. ఇలా ఎవరైనా కావచ్చు వారి ఆలోచనలన్నీ గాంధీ జీవితం, ఆయన ఆశయాలతో ప్రభావితం అయ్యాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ నిజమైన సత్తా ఏమిటో గాంధీ ఆనాడే చెప్పారని, ప్రజలు పాలకులపై కాకుండా తమపై తాము ఎలా ఆధారపడాలో గాంధీ మార్గనిర్దేశర చేశారని మోదీ అన్నారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా సమాజం ఎలా ముందుకు వెళ్లాలో పథనిర్దేశం చేశారని, ఈ విధానాలే నేడు భారత్ ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు పరిష్కారం చూపుతోందన్నారు. ప్రజల అంతర్గత శక్తిని మేల్కొలిపి, మార్పు తీసుకురావడానికి గాంధీ ప్రయత్నించారని మోదీ వివరించారు. ఇతరుల్ని ఎలా ఆకట్టుకోవాలి అనే యుగంలో మనం జీవిస్తున్నామని, కానీ, గాంధీ మాత్రం ఇతరుల్ని ఎలా ప్రేరేపించాలో నేర్పారని, 'కృషి లేని సంపద', 'స్పృహ లేని ఆనందం', 'గుణం లేని జ్ఞానం', 'విలువల్లేని వ్యాపారం', 'మానవత్వం లేని శాస్త్రవిజ్ఞానం', 'త్యాగం లేని మతం' ఈ ఏడు మనిషి దృష్టి మరల్చేవని వీటిని పట్ల జాగ్రత్తగా ఉండాలని గాంధీ సూచించారన్నారు. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, అవినీతి లాంటి రుగ్మతల నుంచి మానవాళిని రక్షించుకోవడానికి ఈ ఏడు సూత్రాల అంశం నేటికీ ఆచరణీయమే అన్నారు. మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో గాంధీ చూపిన మార్గం మనందరికీ స్ఫూర్తివంతంగా నిలుస్తుందని ఆశిస్తున్నాను' అంటూ గాంధీ సిద్ధాంతాల్ని, సమకాలీన ప్రపంచంలో వాటి ఔచిత్యాన్ని మోదీ స్పష్టంగా వివరించారు. ఈ సందర్భంగా ఐరాసలో భారత్ నెలకొల్పిన ప్రత్యేక సోలార్ ప్లాంట్‌ను మోదీ దేశాధినేతల సమక్షంలో ప్రారంభించారు. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌తో పాటు, సింగపూర్, భూటాన్, దక్షిణ కొరియా, సింగపూర్, జమైకా, న్యూజిలాండ్ సహా పలువురు ఇతర దేశాధినేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు కేసీఆర్ ఇస్తున్న కానుక బతుకమ్మ చీర

- అది ఎంతప్రేమతో ఇస్తున్నామో గమనించాలి
- బతుకమ్మ పండుగ పుట్టిందే వరంగల్‌లో
- 28న వరంగల్‌లో జరిగే బతుకమ్మ పండుగలో మాజీ ఎంపీ కవిత పాల్గొంటారు

– పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వరంగల్, సెప్టెంబర్25(ఆర్ ఎన్ఎ) : బతుకమ్మ చీరలను పుట్టింటివారు పెట్టినట్టుగా ఆడబిడ్డలు పవిత్రంగా భావించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. బుధవారం ఆయన హన్మకొండ అంబేద్కర్ భవన్‌లో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చీర ఎంత క్వాలిటీ అనేది ముఖ్యంకాదని, అది ఎంత ప్రేమతో ఇస్తున్నామో గమనించాలన్నారు. కేసీఆర్ ఆడబిడ్డలకు ఇస్తున్న కానుక బతుకమ్మ చీర అని అన్నారు. బతుకమ్మ పండుగ పుట్టిందే వరంగల్లో అని మంత్రి చెప్పారు. ఈనెల 28న పెత్తరమాస రోజు సందర్భంగా వరంగల్‌లో జరిగే బతుకమ్మ పండుగ కార్యక్రమంలో మాజీ ఎంపీ కవిత పాల్గొంటారని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. బతుకమ్మ చీరలపై కొందరు ఏదేదో మాట్లాడుతున్నారని, బతుకమ్మ పండుగ సందర్భంగా తోబుట్టువులకు ఇచ్చే కనుక వెలకట్టలేనదిన్నారు. బతుకమ్మ చీరకూడా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చే పుట్టింటివారి కానుకగా భావించాలన్నారు. రాష్ట్రంలో రూ.313 కోట్లతో 1 కోటి 2లక్షల చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. వరంగల్ జిల్లాలో పుట్టింది బతుకమ్మ అని, సమైక్య పాలనలో పాలమూరు, సూర్యాపేటలో బతుకమ్మ పండుగ తెలియని పరిస్థితి ఉందని, కేసీఆర్ కూతురు కవిత వచ్చిన తరువాత బతుకమ్మ పండుగ గ్రామగ్రామాన ఉత్సవంలా జరుపుతున్నారన్నారు. అమెరికాలో కూడా బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకుంటున్నారు. గర్భిణీ స్త్రీలకు 12 వేల రూపాయలు, కేసీఆర్ కిట్, ఇచ్చి ఆడపడుచులకు ఆదరణ చూపించిన మహానుభావుడు కేసీఆర్ అని అన్నారు. వినయ్ భాస్కర్ మీకు ఎమ్మెల్యేగా ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. జిల్లాలో ఈ నెల 28న బతుకమ్మ వరంగల్ నుంచే రాష్ట్ర ఉత్సవాలు మొదలవుతున్నాయని అన్నారు. వచ్చే నెల 5న కేటీఆర్ వరంగల్ పర్యటన ఉంటుందని అన్నారు. వినయ్ భాస్కర్ కు తోడుగా అభివృద్ధి కి సహకరిస్తామని, మాస్టర్ ప్లాన్ ఆమోదం కోసం కేటీఆర్ కోరుతామన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మేయర్ గుండా ప్రకాష్ రావు, కూడా ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

## కమర్షియల్ బ్యాంకులను మూయడం లేదు: ఆర్బీఐ

న్యూఢిల్లీ, సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ) : పలు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను విలీనం చేస్తున్న నేపథ్యంలో కొన్ని కమర్షియల్ బ్యాంకులను మూసివేస్తున్నట్లు వస్తున్న వార్తలను బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖండించింది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజంలేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. అవన్నీ తప్పుడు వార్తలంటూ ఆర్బీఐ ట్వీట్‌లో పేర్కొన్నది. కొన్ని బ్యాంకులను మూసివేస్తున్నట్లు వస్తున్న ఊహాగానాల్లో నిజం లేదని కూడా ఫైనాన్స్ కార్యదర్శి రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను మూసివేయడంలేదన్నారు. కస్టమర్లకు ఉత్తమమైన సేవలను అందించేందుకు ప్రభుత్వమే పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను బలోపేతం చేస్తుందని రాజీవ్ కుమార్ తెలిపారు.

# పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త

హైదరాబాద్, సెప్టెంబర్25 (ఆర్ఎన్ఎ) : ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత ఆర్థిక సంవత్సరానికిగాను (2018–19) ఉద్యోగుల భవిష్యనిధిపై (ఈపీఎఫ్) వడ్డీ రేటు పెరిగింది. గతంలో ఉన్న 8.55 వడ్డీ శాతాన్ని 8.65 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిర్ణయం ఇప్పటికే ఆర్థిక మంత్రిత్వశాఖ అనుమతి పొందినట్లు కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ వెల్లడించింది.

పీఎఫ్‌పై వడ్డీరేటును పెంచాలనే ప్రతిపాదనను గత ఫిబ్రవరిలోనే తెరమీదకు వచ్చింది. భవిష్య నిధి సొమ్మును పెట్టుబడులు పెట్టడం ద్వారా వచ్చిన లాభాల ఆధారంగా వడ్డీ రేటును ఈపీఎఫ్ఓ నిర్ణయించినట్లు కార్మికశాఖ మంత్రి సంతోశ్ గంగ్వార్ వెల్లడించారు. అయితే ఇది ఆర్థికశాఖ ఆమోదం పొందాల్సి ఉండడంతో జాప్యం జరిగింది. ఈ నెల 19న ఆర్థికశాఖ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలపడంతో 2018–19 ఏడాదికి గానూ వడ్డీ రేటును 8.65 శాతానికి పెంచారు. తాజా పెంపుతో దాదాపు ఆరు కోట్ల ఈపీఎఫ్ ఖాతాదారులు లబ్ది పొందనున్నారు.

# ఆటోను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్

## పది మంది దుర్మరణం

చండీఘర్, సెప్టెంబర్25 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని జింద్ ప్రాంతంలో వేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్, ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో 10 మంది మరణించగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారిని హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. కాగా, ఆటోలో 10 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# దోపిడీ కేసు ఛేదించిన ఎస్.ఆర్.నగర్ పోలీసులు

హైదరాబాద్,సెప్టెంబర్25 (ఆర్ఎన్ఎ): నగరంలోని ఎస్.ఆం.నగర్ పరిధిలో రెండు రోజుల క్రితం జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. సీబీఐ అధికారుల పేరుతో న్యూమరాలజీ కేంద్రం నిర్వాహకుడికి బెదిరించి కొందరు దుండగులు నగలు, ల్యాప్‌టాప్‌లతో ఉడాయించారు. ఈ నెల 23న అమీర్‌పేటలోని ఉషా న్యూమరాలజీ కేంద్రం నిర్వాహకుడిని బెదిరించి ఈ చోరీకి పాల్పడ్డారు. బాధితుడు జగదీశ్ నిన్న ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. ఐదుగురిని అరెస్టు చేసి 20 తులాల బంగారం, 10 ల్యాప్‌టాప్‌లు, 12 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చోరీలో గతంలో జగదీశ్ వద్ద పనిచేసిన వ్యక్తి హస్తం ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు.

# దేశంలో ఉగ్రదాడులకు ప్లాన్

న్యూఢిల్లీ,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో భారత్‌లో భారీ ఉగ్రదాడులకు కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. అమెరికా మాదిరే భారత్‌లో కూడా 26/11 తరహా దాడులు చేసేందుకు పథకం పన్నుతున్నారని ఇంటిలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. జమ్మూకశ్మీర్‌లో ఆత్మాహుతి దాడితోపాటు దేశవ్యాప్తంగా 30 చోట్ల పేలుళ్లకు కుట్ర పన్నినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇప్పటికే 10 మంది జైషే ఉగ్రవాదులు భారత్‌లో చొరబడినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఇంటిలెజెన్స్ వర్గాల హెచ్చరికల నేపథ్యంలో పఠాన్ కోట్, జమ్మూకశ్మీర్, శ్రీనగర్‌లో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. రాష్ట్రాలను అప్రమత్తం చేయడమే కాక.. భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించాయి.

# మల్లేపల్లిలో మినీ జాబ్ మేళా

హైదరాబాద్,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ) : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించుటకు ఈ నెల 26 (గురువారం) విజయ్‌నగర్ కాలనీలోని మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్ వద్దనున్న జిల్లా ఉపాధి కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మైత్రిప్రియ తెలిపారు.

పేటీఎం, రిలయన్స్ డిజిటల్, చోళ ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్, కాలిబర్, ఫిన్స్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్, ఆర్‌బీఎల్ ఫిన్ సర్వ్ లిమిటెడ్ తదితర ప్రైవేట్ కంపెనీలలో హైదరాబాద్ నందు పని చేయుటకు దాదాపు 500 ఉద్యోగాల ఎంపికకు జాబ్ మేళా నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ఈ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఐటీఐ, డిప÷–లొమా, పీజీ చదివిన అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ టెక్నిషియన్, హెల్పర్స్, ఎలక్ట్రిషియన్, ఏబీఎం మొదలగు ఉద్యోగాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికైన వారికి రూ. 9 వేల నుంచి రూ.18 వేల వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థుల వయసు 18–35 సంవత్సరాల లోపు పురుషులు, స్త్రీలు అర్హులని, అర్హత ఆసక్తి గల జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో గురువారం మల్లేపల్లి బాలుర ఐటీఐ క్యాంపస్ జిల్లా ఉపాధి కార్యాలయం ఉదయం 10 .30 గంటలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు టి. రఘుపతిని ఫోన్ నం. 8247656356 సంప్రదించవచ్చున్నారు.

# విద్యుత్ ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హైదరాబాద్,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): విద్యుత్ సంబంధిత సమస్యల ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి తెలిపారు. నగరంలో వర్షం నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై సూపరింటెండెంట్ ఇంజినీర్లతో సీఎండీ రఘుమారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. రోడ్లు, భవనాలపై తెగిపడిన తీగల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపార్టుమెంట్ల సెల్లార్లలో నీరు చేరినా, తీగలు తెగిపడితే తాకకుండా విద్యుత్‌శాఖ వారికి తెలియజేయాలన్నారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# వేణుమాధవ్ ఆసుపత్రి బిల్లు కట్టిన మంత్రి తలసాని

హైదరాబాద్, సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ) :: బుధవారం మరణించిన వేణుమాధవ్ భౌతికకాయానికి మంత్రి తలసాని శ్రీనివాస్ సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో నివాళులర్పించారు. వేణుమాధవ్ ఆస్పత్రి బిల్లును మంత్రి చెల్లించారు. అలాగే అంత్యక్రియలకు కూడా రూ.2లక్షలు సాయాన్ని ప్రకటించారు.

గత కొన్నాళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వేణుమాధవ్.. ఈ నెల 6 నుంచి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన రెండు కిడ్నీలు పూర్తిగా దెబ్బతినడంతో బుధవారం మధ్యాహ్నం 12.21 గంటలకు తుదిశ్వాస విడిచారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ తన్మయము నొందుచు సతతము
సన్మానములందుకొనెడి సద్గుణమూర్తిన్
మున్ముందుగ..నే!.. గాంచెద
'మన్మోహనసింగు'ను రసమయ విస్ఫూర్తిన్!!

( సెప్టెంబర్ 26 మన్మోహన్‌సింగ్ జననం..)



–రాధశ్రీ

సెల్: 9494481210



పుల్లా మురళీఆకాశ్ మొదటి నవల

# ముగింపు లేని కథ

(గత సంచిత తరువాయి..)

అది తొమ్మిదవ తరగతి చదువేటప్పుడు, ఆ రోజు వర్షం పడుతుంది. ఇంట్లో కూర్చొని రాస్తున్నాను. "ఏం రాస్తున్నావురా పొద్దునుంచి చూస్తున్నా తిండి తినకుండా" అంటూ వచ్చింది అమ్మ.

కథ రాశాను అమ్మా... "హీ...హీ... హీ... ఎందీ నువ్వు కథ రాశావా ? నీలాంటి వాళ్ళు కూడా కథ రాస్తే ఇక అంతే" అంది చెల్లి వెనుక నుంచి వస్తూ.

**"గిన్నెలు తోమడానికి రాదు నీకు, నా కొడుకు కథ రాస్తే వెక్కిరిస్తావా ?**

చేతకానివాళ్ళు వెక్కిరించడం తప్ప ఇంకేమి చేయలేరు" అంది అమ్మ.

'ఏమేయి నా కూతుర్ని ఏమో అంటున్నావు" అంటూ వచ్చాడు నాన్న.

"చూడండి నా కొడుకుని నువ్వు కథ రాశావా అని వెక్కిరిస్తుంది".

"ఏమిటి నీ మహాపుత్రుడు ఎప్పటి నుంచి కథలు రాయడం మొదలు పెట్టాడు" అన్నాడు.

"ఏమిటండి మీరు కూడా.... హ్.... హ్... అని నవ్వుతున్నారు. వీడు కథ బాగా రాసింటే నేను, నా కొడుకు గెలిచినట్టు, లేకుంటే మీరు గెలిచినట్టు అంది.

"సరే చూద్దాం" అని అన్నారు నాన్న. నా కథ అమ్మ చదవడానికి తీసుకుంది.

"నాకు ఖచ్చితంగా తెలుసు, అది చెత్త కథే" అంది చెల్లి.

"ఏయ్ ! నువ్వు నోరు మూసుకొని కూర్చో" అంది అమ్మ.

అమ్మ కథ చదవడం మొదలు పెట్టింది –

కిందికి దూకాలా వద్దా, దూకితే నాకేం లాభం, వూరికినే కాలు చేతులు విరగొట్టుకోవాలా ? స్వచ్ఛమైన ప్రాణం కూడ మాసిపోతుందో ఈ మనుషులతో చేరితే నన్ను ఇప్పటికే మాసిపోయేలా చేశారు. ఇంకా కొద్ది కాలంలోనే నా ఊపిరి తీసేస్తారు, కానీ కిందికి దూకితే నాకేం లాభం.

మా తాత, ముత్తాతలు నాకంటే ముందే పుట్టి చనిపోయారు. చెప్పు మబ్బు చెప్పు నేను నీతోనే ఉంటాను. కిందికి దిగను, ఇంతలోపల అమ్మ ఆపింది. "అమ్మా ! చదువమ్మా ! ఎందుకు ఆపావు. ఇంతకి ఎవరమ్మ అది తొందరగా తెలుసుకోవాలి" అంది చెల్లెలు.

"మరీ చెత్త కథ అన్నావు" "నువ్వు చదువమ్మ" అంది చెల్లి.

"నీవు కిందకు దూకితే నాకు పుణ్యం వస్తుంది చినుకుతో అంది మబ్బు. "అమ్మా నాకు అర్థం అయింది, అది చినుకు కదా ! వర్షం కదా"

"నువ్వు వుండవే నువ్వు చదువు" అంటూ అమ్మను అడిగాడు నాన్న.

"ఆ సముద్రంలోనైన కిందికి దూకుతాను తప్ప ఇక్కడ మాత్రం కిందకి దిగనుగాక దిగను".

"అక్కడ దిగి నువ్వు ఏమి సాధిస్తావే, అక్కడ వుండేది ఉప్పు నీరు. అందులో కలిసిపోతావు కాని ఒక్కరికి సహాయ పడలేవు" అంది మబ్బు.

**'అక్కడైనా బ్రతకవచ్చుగాని ఇక్కడ ఈ మురికి కాలువల్లో మాసిపోయిన దానిల్లా పడుండాలి తప్ప ఇంకేం చేయలేను, అందులో వచ్చే దుర్వాసన పీల్చుకోవడం కన్న చావడం మేలు".**

ఇక వర్షం ఎప్పుడో పడుతుంది, వున్న ఒక్క శాతం నీరునైనా కాపాడుకుందాం అనేది




లేకుండా పోటీలు పడి నీటితో ఆటలు ఆడి నీటిని వృధాగా పోనిస్తారు. అందుకే ఇక్కడ కిందికి దిగడం కన్న ఆ సముద్రంలో దూకడం మేలు, నేను ఏదో పైన ఉండి మాసిపోకుండా ముత్యంలా ఉందాము అనుకుంటే, ఆ రాక్షస మానవులు ఇక్కడికిదాపరి ంచారు. పైన ఉండి నీరును కలుషితము కాకుండా కాపాడుకుందాం అనుకుంటే ఆ ఫ్యాక్టరీలను కట్టి వాటి నుంచి వచ్చే విషంవాయువులను పైకి వదులుతున్నారు. వాన నీటిని కాలుష్యం చేస్తున్నారు.

మా తాత అయిన ఆక్సిజన్‌ను లేకుండా చేస్తున్నారు. ఏదో ఫ్యాక్టరీలతో అంటే అవసరం, ఏమీ చేయలేం. ఇంకా దగ్గర వున్న పనులకి కూడ బైక్‌ని తీసి బుర్రు... బుర్రు అనిపిస్తారు. ఇంకా ఏమి పనిలేకున్నా గిర్ర్.... గిర్ర్‌మని తిరుగుతారు.

ప్రభుత్వం కాలుష్యాన్ని తగ్గించటం కోసమని బస్సులని ఏర్పాటు చేస్తే వాటిని వాడరు కూడా వాడరు. తమ బండ్ల మీద తిరిగి నాశనం చేస్తారు".

"మేము మాలాగా ఉన్న కలుషితమైన మబ్బు లతో కలిసి వర్షిస్తే మళ్ళా దానికో పేరు పెట్టారు ఆమ్ల వర్షం అని. మరి మమ్మల్నే తిడుతారు, ఏదో మేమే విషం కురుస్తున్నట్టు" అంది చినుకు.

"నీ కోసం నేల తల్లి ఎదురుచూస్తుంది. వారు ఏమి చేసినానువ్వు కిందికి దిగాలి కదా" అంది మబ్బు.

"ఆ ఎందుకు దిగాలి. దేవుడు ఏ జీవికి ఇవ్వని తెలివిని ఆ మనిషికి మాత్రమే ఇచ్చాడు. ఆ తెలివిని వాడు అనవసరమైన పనులకే ఉపయోగిస్తున్నారు. వాళ్ళు గంటల సేపు స్విమ్మింగ్ పూల్‌లో ఈదుతున్నాడు. ఒక్క గిన్నెడు నీళ్ళ కోసం ఎదురు చూసే పక్షులు, జంతువులు దాహం తిరుస్తారా ఏమన్నా, తన్ని తరుము తారు.

పులులు, ఏనుగులు జంతువులు ఊరిలోకి వస్తే వాటిని చంపేదాక విడువరు. అవి ఎందుకు వస్తున్నాయి. ఒకరైనా ఆలోచిస్తారా. ఎందుకు నేను కిందకు దిగాలి, నదులన్ని ఎండగొడుతున్నారు. జలచరాలకు ఊపిరి లేకుండా చేస్తున్నారు.

"ఐనా మబ్బూ ! నువ్వు ఎందుకు ఆ మానవుడికి సహాయం చేయాలి అనుకుంటు న్నావు, నాకు అర్థం కావట్లేదు ?

"ఎవడైనా ఒక్కడైనా మన కోసం అర్థిస్తున్నాడా....

అంతలో "ఓ వానదేవుడా ! కరుణించవయ్యా" అంటూ ఒక దీన గొంతు వినపడింది. "ఎవరూ" అని చినుకు కిందికి చూసింది.

నెత్తిమీద ఒక గుండ్రని చుట్టమాదిరిగా బట్ట, బక్క ఎముకలతో, బుగ్గలు లోతుగా పోయాయి. కళ్ళు ఉన్నాయోలేదో అన్నట్టుగా చేతిలో సారం వుందోలేదో కూడ తెలియనట్టుగా ఉన్నాడు.

"చినుకమ్మా ! అటు చూడు, ఎవరూ నీ కోసం అర్థించడం లేదు అన్నావు, అది విన్నావా? అతని దీనగొంతు, అది నిజము కాదు అని మాత్రం అనవద్దు. అతని కళ్ళలోకి చూడు, ఆ కన్నీళ్ళు చూడు, ఏడ్చిఏడ్చి ఎంత లోతుకుపోయాయో అన్నదాత అన్న పేరేకానీ తన ఆకలినే తీర్చుకోలేక ఎముకలు చూడు ఎలా బయటపడ్డాయో.

ఐనా తన బిడ్డలకు అన్నం పెట్టాలన్న ఆశతో లక్షలు లక్షలు అప్పు పెట్టి పురుగుల మందు, ఎరువులు తీసుకొని, వర్షం పడక అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రైతుకు ఇతర పనులు చేసేవారికి ఒకటే తేడా




అదే పొట్ట.

**రైతులు పగలు, రాత్రి వాననక, ఎండనక కాయకష్టం చేసి బోర్లతోనే నీటిని పైకి తెప్పించి, సాగుచేసి, పండిస్తే, ఇంటి నుంచి ఎన్నో ఆశలతో మార్కెట్‌కు అమ్మడానికి తీసుకెళ్తే మధ్యవర్తులు ఉన్న రేటును, గింజలు బాగాలేవు, పెద్దగా లేవు అని సగం కన్న తక్కువ రేటుకే కొంటామంటారు.**

ఆ పంటను బయటపడేయలేక, ఇవ్వలేక వచ్చిన నాలుగు డబ్బులు ఇంటికి తీసుకువస్తే, ఆ డబ్బులు అప్పుకే సరిపోతే, ఆ కుటుంబం ఎలా బతకాలి. ఎన్నో వేల కోట్లు అప్పులు చేసేవాళ్ళు డబ్బులు కట్టలేక విదేశాలకు పారిపోతారు. కానీ రైతు అలా పారిపోకుండా సరాసరి ఈ లోకాన్నే వదిలి పోతాడు.

ఆయననే నమ్ముకున్న కుటుంభీకులు వీధినపడుతారు. అన్నం పండించి, అన్నం తినేవాళ్ల సంతోషాన్నే కోరుకుంటాడు. అన్ని దానాలలోకన్నా అన్నదానమే మిన్న అంటారు.

అలాంటి అన్నదానం చేసే రైతుకే అన్నం లేకపోతే మనం జీవించి వృథా. ఇందులో ఆయన ఎన్నిసార్లు ఓడిపోయినా మరిమరీ ప్రయత్నిస్తాడు. కానీ నువ్వు ఏం చేయనక్కల్లేదు. ఒకే ఒకటి నీ స్వచ్ఛమైన జలం ఆ భూమి బిడ్డకు అందించు చాలు.

ఎన్ని రోజులు వాన కోసం ఎదురు చూసినా వాన రాకపోవడంతో చేసేదేమిలేక రైతు చెట్టు దగ్గరకు వెళ్ళాడు. అక్కడ ఏదో తాడు వుంది. దానికి తన గొంతుకు ఉరి వేసుకున్నాడు, అది బిగుసుకుంది.

అంతలోనే మబ్బు తన పిడుగును ఆ చెట్టు మీద పడేలా చేసింది. ఆ కొమ్మ విరిగి కింద పడింది. ఊపిరి ఆడక కళ్ళు తిరిగి పడిపోయాడు.

చినుకు రైతును చూసింది. ఆగలేకపోయింది. ఆకాశంనుంచి భూమి మీదకు జారింది. నేలంతా తడిపింది. నేల పచ్చద‍నంతో నవ్వింది. మబ్బు అది చూసి సంతోషబడింది.

నీతి : కష్టపడి పని చేసే వారికి కొంచెం సహాయం చేయాలి. వారే విజయం సాధిస్తారు.

"ఇప్పుడు చెప్పు ఎలా ఉంది కథ" అంది అమ్మ.

"చాలా బాగుంది" అన్నాడు నాన్న.

"మీరు ఓడిపోయారని ఒప్పుకోండి" అంది అమ్మ. చెల్లెలు బుంగమూతి పెట్టింది.

"అమ్మా వాళ్ళు ఓడిపోలేదమ్మ, వాళ్ళు గెలిచి మనల్ని గెలిపించారమ్మ" అన్నాను.

"ఎలారా !" అంది అమ్మ.

"అమ్మా !! నా చెల్లెలి వల్లే కదమ్మా ! అది ఎలా ఉందో తెలిసింది, కాబట్టి మనం అందరం గెలిచాం" అన్నాను.

"చూశారా నా కొడుకు ఎంత మంచివాడో" అంటూ నాకు బుగ్గమీద ముద్దు పెట్టింది. చెల్లెలు ఇంకా బుంగమూతిని పెద్దది చేసింది.

ఎంతైనా ఆ చిన్నప్పుడు ఎన్ని చేసినా ఆ మధురానుభూతులు ఎప్పటికీ మరిచిపోలేం. నా జ్ఞాపకంతో పాటు ఆ వర్షం కూడా ముగిసింది. నేను ఇంకా చాలా దూరం నడవాలి. ఇంక నావల్ల కాదు. హమ్మయ్య బస్సు వస్తుంది.

ఎక్కి సీట్లో వెళ్ళి కూర్చున్నాను. తెలిసిన కండక్టర్, టికెట్‌కు డబ్బులు తీసుకోనన్నాడు. తీసుకో తీసుకో అంటే తీసుకున్నాడు. అలా ముందుకు వచ్చి కూర్చున్నాను. "ఏమయ్య కండక్టరు వెనుక స్టేజిలో వర్షం పడలేదా" అని అడిగాను.

"పడలేదు సార్ !" అన్నాడు.

ఏమి వర్షాలో ఏమో ! ఒక చోట కుండపోత వర్షం పడుతుంది, ఒకచోట తను ఏమి చేయలేనట్టుగా తనకసలు ఏమి తెలియదు అని. సంవత్సరాలు, సంవత్సరాలు వర్షం కురవదు, ఏమి వర్షమో ఏమో అనుకున్నాను.

"ఏమి కండక్టరూ !! రోజు రోజుకు జనాలు ఎక్కువ వస్తున్నట్లున్నారు".

"గురువుగారు జనాభా పెరుగుతుంది కదా ! ప్రపంచ దేశ జనాభాలలో మనదే కదా రెండవ స్థానం" అన్నాడు.

"ఎన్ని పెరిగినా భూమి మాత్రం పెరుగదుకదా" అన్నాను.

మీరు చెప్పింది అక్షరాలా సత్యం గురువు గారు అన్నాడు. తను నన్ను గురువుగారు అని పిలుస్తుంటాడు. అప్పుడు వచ్చింది చెడ్డ వాసన. అందరూ దగ్గుతున్నారు. ఎందుకా అని బయటికి చూశాను. ఒక రైతు పురుగు మందులు, మరికొందరు మందులు చల్లుతున్నారు. అందుకే చెడ్డ వాసన వస్తుంది. దాని పక్క చేనులో అప్పుడే కొన్ని గువ్వలు చక్కర్లు కొడుతూ మొక్కజొన్న కంకుల మీదకు దిగుతున్నాయి.

అక్కడ ఒక ముసలితాత, ఒక పిల్లవాడు కనబడ్డారు. ఆ పిల్లవాడు, అతని మనవడు కాబోలు. ఆ దృశ్యం చూసి చిన్ననాటి జ్ఞాపకం గుర్తుకు వచ్చింది. తాత తనకు చెప్పిన కథ గుర్తుకు వచ్చింది. ఆ గ్రామాన్ని ఎప్పటికి మరిచిపోలను.

నేను పన్నెండో ఏట తాతగారి ఊర్లో ఉన్నాను. ఆ గ్రామం ఎంత పచ్చగా ఎంత అందంగా ఉందో. పొద్దున్నే ఎవరూ లేయకముందే అంటే కోడికూయకముందే లేచి, అవ్వా...అవ్వా... అని వెతికాను, తాత గురకపెట్టి నిద్రపోతున్నాడు. కానీ అవ్వ కనబడలేదు.

బయట కసువు నూకుతున్న శబ్దం వచ్చి, బయటకు పరుగెత్తాను. నేను అనుకున్నది నిజమే. అవ్వ కసువు నూకి నీళ్ళు కొడుతుంది. నన్ను చూసి "చిట్టినాన్న ఎంత పొద్దునే లేచావా ?" అంటూ ముద్దు నుదిటి మీద పెట్టింది.

"ఇంత పొద్దునే ఎందుకు లేచావురా చిట్టి" అంటూ అడిగింది. "అవ్వా...అవ్వా నిన్న రాత్రి నువ్వు భోజనం చేసేటప్పుడు తాతయ్యతో పాటు నువ్వు పొలానికి వెళ్దువు" అన్నావు కదా.

"నాన్నా చిట్టీ ! నీకు పొలం అంటే ఎందుకు అంత ఇష్టం రా అంది.

"ఏమో నాకు తెలియదు అన్నాను" "సరే పదా మీ తాతయ్యను లేపుదాం, పెద్ద మొద్దులా పడుకొని ఉంటారు".

నేను ఎగురుతూ ఎగురుతూ ఎగురుకుంటూ తాతయ్య ముందు వెళ్ళి నిలబడ్డాను. "చిన్నగా వెళ్ళు" అంటూ అవ్వ నా వెంట వచ్చింది. "తాతయ్యా... తాతయ్యా... తాతయ్యా..." అంటూ లేపుతున్నాను. కానీ తాతయ్య లేవలేదు.

"రేయి ఉండరా అంటూ లోపలికి వెళ్ళింది. నేను తాతను లేపుతున్నాను. టప్‌మని నీళ్లు పోసింది అవ్వ. తాత ఉలిక్కిపడి లేచాడు. హ్...హ్... అని నవ్వుతున్నాను. మీ తాతయ్యతో రోజు ఇదే తంతు. రోజు నీళ్ళు పోసి లేపితేకానీ లేవడు" అంది.

"లే లేవండి, వీన్ని పొలానికి తీసుకుపోతానని మాటిచ్చారు కదా !"

"అవునే తీసుకుపోతాను, కొద్దిసేపు పడుకోనివ్వు" అన్నాడు తాత ఆవలిస్తూ.

"లేస్తారా లేదా ! ఇంకా ఒక చెంబు తీసుకొని రావాలా !" అంది అవ్వ.

"వద్దుగాని ఒక బకెట్ నీళ్ళు తీసుకురా" అన్నాడు తాత.

"తాతయ్య నీవు చల్ల నీళ్ళు ఇంత పొద్దునే పోసుకుంటావా" అన్నాను.

"అవునురా అలా అన్నీ చేస్తూ ఉంటేనే నాలా గట్టిపడతావు, పద నీకు స్నానం చేపిస్తా" అన్నాడు.

"తాతా చాలా చల్లగా వున్నాయి" "ఏమి కాదురా" అంటూ పోశాడు.

"అబ్బబ్బా" అంటూ ఒణికిపోయాను. "రారా ఇంకా చాలురా" అంటూ అవ్వ పిలిచింది. తల తుడిచింది.

పైన ఒక అంగి కింద మోకాలి వరకు ట్రౌజర్ వేసుకొని తాతగారి దగ్గరకు వెళ్ళాను. తాత పంచ గట్టుకొని, మీసాలు గిర్రని పైకి తిప్పి, తల మీద తెల్లని తలపాగా చుట్టుకొని గంభీరంగా ఉన్నాడు.

"పదరా" అంటూ చేయి పట్టుకొని పిలుచుకొని పోతున్నాడు నన్ను తాతయ్య.

అబ్బా ఎంత చల్లగాలి, చుట్టూ పొగమంచు, మబ్బు చుట్టుకొని ఉంది. అప్పుడే సూర్యుని కిరణాలు పొలాల మీద గట్ల మీద పడుతూ ఉన్నాయి. మా చేనుకు ఇంకా ఒక చేను దాటాలి. ఆ మంచు ఆకుల మీద పడి ఆ సూర్యకిరణాలు తాకడంతో అవి ముత్యాల కన్నా అందంగా మెరుస్తున్నాయి.

"చిన్నోడా ! అదిగో అదే మన పొలం" అన్నాడు తాత.

చిన్నగా తెల్లవారింది. గువ్వలు, పక్షుల కోలాహలంతో పంట పొలాలన్ని ఒక పెళ్ళి పందిరిలా ఉంది. తాతయ్యా ! నువ్వు మొక్కజొన్న కంకి కదా వేసింది అన్నాను.

కంకిని చూపిస్తూ,

"అవురా" అన్నాడు తాతయ్య.

తాతయ్య పనిలో మునిగిపోయాడు నేను ఆడుకోవడంలో మునిగిపోయాను. రానురాను ఎండ పెరిగిపోతుంది. తాతయ్య చెట్టుకింద చేరిపోయాడు.

"రేయి ఇక్కడకిరా" అని కేక వేశాడు, చెట్టు కిందికి రమ్మని.

'వస్తున్నా తాతయ్యా" అంటు పరిగెత్తుకెల్లాను.

"తాతయ్య నాకొక కథ చెప్పు తాత" అన్నాను. అంతలోనే ఎక్కడి నుండో కొన్ని గువ్వలు ఎగురుతూ వచ్చాయి. ఉస్...ఉస్... అంటూ తరమడానికి వెళ్ళాను.

"చిన్నోడా ఆగు, అలా చేయకూడదురా ! ఇక్కడికిరా" అన్నాడు. నేను వినకుండా వెళుతున్నాను. నేను నీకు ఒక కథ చెప్పుతా వాటిని వదిలేయ్ అన్నాడు.

"సరే తాత చెప్పు" అంటూ ఎందుకు వదిలేయమన్నాడో తెలియక తాతదగ్గరికి వచ్చాను.

తాత కథ చెప్పడం మొదలెట్టాడు.

అది ఒక పొలం. పచ్చని పొలం, మన పొలం ఎలాగుందో అలా.

మంటలు–మంటలు – పారిపోండి, పారి పోండి అంటూ ఏనుగు అరుస్తుంది. ఎన్నో జీవులు అప్పటికే ప్రాణాలు పోగొట్టుకున్నాయి. పక్కనే ఎంతో పెద్ద నది ప్రవహిస్తున్నా ఆ నీళ్ళు ఈ మంటలని ఆర్పడానికి రాలేవు. ఆ మంటల నుంచి బతుకు జీవుడా అనుకుంటూ బయటపడింది ఒక గువ్వ. కానీ తమ వాళ్ళని కాపాడలేకపోయింది.

తన బంధువులు, అమ్మ, నాన్న, చెల్లెలు గురించి ఆలోచిస్తూ ఏడుస్తుంది. ఇలాగే ఉంటే తాను కూడా చావాల్సి వస్తుంది అనుకొని లేచి ఆహారం కోసం వెతకడం మొదలెట్టింది గువ్వ.

"అబ్బా ఎంత ఏపుగా పెరిగింది ఆ మొక్కజొన్న చేను. చూడగానే నోరూరుతుంది. ఆహారం తినక రెండు రోజులు అయింది" అనుకుంటూ గాలిలోకి ఎగిరి ఒక మొక్కజొన్న కంకి దగ్గరకు చేరుకుంది. దాని మీద కూర్చుని తినడానికి దగ్గరకు వెళ్ళింది.



అంతలోపలే "ఆగు" అని శబ్దం రావడంతో ఆగిపోయింది. "ఎవరు నువ్వు ? నిన్ను ఎప్పుడు ఇక్కడ చూడలేదే, ఎప్పుడు నువ్వు నాకు కనపడలేదు, ఎక్కడి నుంచి వచ్చావు ?" అంది మొక్కజొన్న కంకి.

"నేను ఆ నది పక్కన ఉన్న అడవిలో నుంచి వచ్చాను" అంది గువ్వ. "ఓరి వెధవా ! పండ్లు, పూలు, మొక్కలు, అంత మంచి అడవి తల్లిని వదిలివచ్చావా" అంది మొక్కజొన్న కంకి.

"అది కాదు ఆ అడవిలో మంటలు పెట్టి తగలబెట్టారు. మా వాళ్ళు అందరూ చనిపోయారు. నేను ఒక్కనే బతికిపోయాను. ఆకలి అవుతుండడం తో తినడానికి ఇక్కడికి వచ్చాను. నాకు చాలా ఆకలిగా ఉంది, నన్ను తిననివ్వు".

"నన్ను తింటే నువ్వు ఖచ్చితంగా చచ్చిపోతావు.

దేవుడు నన్ను అందరి ఆకలి బాధ తీర్చేలా చేశాడు. రైతు నా కన్న తండ్రి లాంటివాడు. తానే నన్ను విషతుల్యం చేస్తున్నాడు. ఇప్పటికే నా తల్లి భూమాత ఎంతోవరకు నాశనం అయింది. ఇన్నాళ్ళు అందరికి మంచి ఆహరం ఇచ్చి వారి పెరుగుదల చూసి సంతోషపడే నా తండ్రి నేను బాగా పెరుగడంకోసం నాగింజలు ఆహరధాన్యాలు మంచిగా వుండడం కొసం ఎన్నో రకాల పురుగు మందులు కొట్టి నా గుండెలోకి పంపించేలా చేస్తున్నాడు.

ఆయనదేమి తప్పులేదు అంత ఆ పురుగు మందులు రసాయనాలు కొట్టిమని చేప్పే వారిదే. వారే నా తండ్రి రైతును నమ్మించి అధిక దిగుబడి వస్తుందని నమ్మించి మోసంచేస్తున్నారు. ఐనా ఆయన కేమి తెలుసు ఇవి ఏమిచేస్తాయో ?

ఆయన ఆహారం కోసం అలమటించే బిడ్డలకు ఆహారం పెట్టాలనుకుంటున్నాడు. ఈ పురుగు మందులు, రసాయనిక ఎరువులు కూడ అలానే ఉన్నాయి. మొదట్లో మంచి దిగుబడి వస్తుంది. రానురాను భూమిలోని ఇతర పోషకాలు తగ్గిపోయి ఈ పురుగుమందులు మాలోనికి ప్రవహించి మమ్మల్ని తినే మనుషులను నిదానంగా చంపేస్తాయని రైతులకెల్లా తెలుస్తుంది. పాపం, ఆ మందులు గాలిలో చేరి జబ్బులు తెస్తాయని.

నన్ను తింటే నువ్వు ఖచ్చితంగా చచ్చిపోతావు, నన్ను తినవద్దు. నేను పుట్టినప్పుడే మందులు కొడతారు. బాగా పెరగడానికి, నేను పూలు కాసేటప్పుడు, కాయలు కాసేటప్పుడు పురుగులు తినకూడదని కొడతారు.

అది నీకు బయటకు కన్పించకపోయినా నీవు నన్ను తిన్న తరువాత నిన్ను చంపేస్తుంది. నీవు బ్రతకాలంటే ఇక్కడి నుండి పారిపో, నువ్వు నన్ను ఇప్పుడు కాకపోయినా ఎప్పుడు తిన్నా నీకు చావు తప్పదు అంది కంకి.

ఎందుకంటే మా అమ్మ భూమాత నిండా ఆ విషం ఉంది. అది ఎప్పుడు పోదు. రోజు రోజుకు ఇంకా ఇంకా చల్లడం వల్ల చాలా పెరిగిపోతుంది. కొన్నాల్లకు భూమి బీడు భూమిలా మారిపోతుంది. అందుకే నన్ను తినవద్దు అని చెప్పుతున్నా..పో.. ఇక్కడి నుంచి పో" అంది మొక్కజొన్న కంకి.

"మొక్కజొన్న కంకీ ! నిన్ను తిన్నా చనిపోతా, తిన్నకపోయినా ఆకలితో చనిపోతా, ఆకలితో చచ్చి పోకుండా ఆకలి తీర్చుకొని ప్రశాంతంగా తిని చచ్చి పోతా, నన్ను తిననివ్వు" అంటు మొక్కజొన్న కంకిని తిని కిందికి పడి గిలగిలకొట్టుకుంటూ చచ్చిపో యింది.

"తాతా ! ఆ గువ్వ పాపం కద తాత" అన్నాను.

అవునురా, ఆ గువ్వ కూడా మనిషిలాంటివాడు. ఈ రైతులు, గువ్వలు, సీతాకోకచిలుకలు, ఇంకేమైనా జీవులు చేసే కొద్దిపాటి నష్టాన్నే చూస్తున్నారురా. కానీ అవి చేసే మేలు చూడడం లేదు రా" అన్నాడు తాత.

"అవి ఏవి తాతా ?"

"పదా ! నీకు స్వయంగా చూపిస్తాను. పైకి చూడు ఆకాశంలో ఆ గ్రద్దలు ఎందుకు ఎగురుతుంటాయను కున్నావు కింద ఉన్న ఎలుకలు, పాములను తిని పంటను నాశనం చేయకుండా, ఇంకా గువ్వలు, చిన్న పురుగుల, కీటకాలు తిని బెరడు నాశనం కాకుండాచూస్తాయిరా.

"అవునా తాత !"

**ఇదిగో ఈ అందమైన సీతాకోకచిలుకలు పువ్వులను పండ్లుగా తయారుచేస్తాయిరా. ఇంత లాభం పెట్టుకొని ఆ జీవులను నాశనం చేయడం తప్పురా.**

రసాయనాలను వాడేకంటే స్వచ్ఛమైన సేంద్రీయ ఎరువులు ఎరువుగా వేయడం మేలురా. ప్రతిసారి ఒకే పంట పండించేకంటే మార్చి మార్చి వేయడం మేలురా, ప్రతివారం కల్పు మొక్కలను పీకేయడం మేలురా, పంట చేతికొచ్చినాక పంటలో మిగిలిన, అవసరం లేని పంట, ఆకులు, కొమ్మలు తిరిగి భూమిలోకి దున్నడం మేలురా.

వానపాములను భూమిలోకి వేసుకోవడం వల్ల భూమి సారవంతంగా మారుతుంది. వాళ్ళ చెప్పేవి నమ్మి మన పాత పద్ధతులు మార్చిపోతు న్నాం. అందుకే భూమి తల్లి కూడ పంటను సరిగ్గా ఇవ్వడం లేదు.

"తాతయ్య ఒక నిమిషం" అంటూ మొక్కజొన్న కంకిని తెంపడానికి వెళ్ళాను.

"రేయి ఎక్కడికిరా" అని అడిగాడు. మాట వినకుండా ముందు వెళ్ళాడు.

'తాతయ్య" అంటూ గట్టిగా అరిచాడు. "ఏమి రా" అంటూ పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఏమిరా ఏమైంది.

"ఏమిలేదు తాత ఆ మొక్కజొన్న కంకి తెంపడానికి రావడం లేదు".

"అది ఇదిగో ఈ కొడవలితో కొయ్యాలి, ఐనా అంతపచ్చిది తినకూడదు" అన్నాడు తాతయ్య.

"అదికాదు" తాతయ్య.

"నీకు కావాలంటే ఇంట్లో మంచివి ఉన్నాయి, అవి అవ్వతో కాల్పించి ఇస్తాను అన్నాడు.

"తాతయ్య ఇవి నాకు కాదు ఆ పక్షులకు అంటూ పరుగెత్తాను" తాత ఇది చూసి ఎంతగానో సంతోషపడ్డాడు.

(సశేషం..)

(మిగతా వచ్చేవారం..)

నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com

గురువారం 26-9-2019    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    హైదరాబాద్ 3

## నమ్మలేని నిజాలు

బోటు మునక
బాధల ఆలింగనం
మూగ జీవులు

కుక్క చావు
ఉద్యోగానికెసరు
కొసరు వార్త

స్మృతుల ముడి
అనుబంధాల తడి
మదిలోగుడి

తగ్గిన సైజు
మారని విలువలు
జేబులో బొమ్మ

ఆత్మహత్యలు
నిందా పరనిందలు
చితికిన ధైర్యం



- రేడియమ్
9291527757

## శ్రీనిజాలు

ప్రముఖ మైన వక్తలతో
మంజీరా మైదానం!
సందేశాలను వింటూ
బడిపిల్లల అవధానం!

కురుక్షేత్ర యుద్ధంలో
శస్త్రాస్త్రాల్లా కవ్వడి!
సాహిత్యపు శిక్షణలో
సాధన కలాల సవ్వడి!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## నిశి కోసం

కాంతి ఎల్లప్పుడూ క్రాంతినే ఇవ్వదు
కొందరికి చీకటే దీపం

అక్కర్లేని దీపం
అసహనాన్ని పుట్టించటం
నిద్రలనార్పటమే కాదు
కొన్ని జీవితాల్లో చీకట్లను ముట్టిస్తుంది

గుడ్డు చెరని చీల్చిన ఆలివ్ రిడ్లీ
పేగులు కాలో.. చక్రాల కిందకు చేరో
కార్పొరేట్ తళుకులకు
నిర్జీవ కావ్యంగా తీరాన పడి ఉన్నాయి.

ఈపాటికే కథలతో చెరువు మీద వాలాల్సిన అతిధి
చుక్కల్ని కప్పిన దీపాల దారిలో తప్పిపోయాడేమో
లేదా అదే దీపంలో కలిసిపోయి
ఎక్కడో స్మృతి కవితగా రాలాడేమో

పెరట్లో స్వేచ్ఛగా తిరిగే చిన్ని కప్ప
ఇప్పుడు కడుపులో బిడ్డలతో
విద్యుత్ రేఖల పోట్ల నుంచి తప్పించుకుంటూ
ఓ విషాద గీతాన్ని బెకబెకమంటోంది

పోయే ప్రతి పురుగు ప్రాణమూ
వాడిపోబోయే మనిషి జీవితానికి
సాక్షి సంతకమే.
అవును అది ముమ్మాటికీ
చీకట్లు రాల్చే వెలుతురు సంతకం



- శ్రీ వశిష్ఠ సోమేపల్లి
9966460536

## ప్రణామాలు... గురువర్యా!

గురువర్యా!
బోధి చెట్టులాంటి మీ నీడనే కదా!
జీవిత పాఠాలు నేర్చుకున్నది

మీరు వెలిగించిన అక్షర జ్యోతులే కదా!
బతుకు దారులు చూపిస్తున్నవి

ఉన్నత విలువలు పెంచ
ఎంత "తపస్సు" చేశారో...

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ద
ఎంతగా "మేధోమధనం" గావించారో...

ఎంత జ్ఞానామృతాన్ని ఆర్తిగా
మస్తిస్కంలో నిక్షిప్తం చేశారో...

ఎన్ని జీవన సుద్దులు
ముద్దగజేసి అందించారో...

శిలలం మేమైతే...
శిల్పులు మీరయ్యారు

క్రియలం మేమైతే...
కర్తలు మీరయ్యారు

విరులం మేమైతే...
తోటమాలి మీరయ్యారు

కనుపాపలు మేమైతే...
కంటి రెప్పలు మీరయ్యారు

జీవన చిత్రం మేమైతే...
విలువల వర్ణం మీరయ్యారు

మీరు చూపిన ఆదర్శ పథాన పయనించేము
మీరు ప్రసాదించిన
"విజ్ఞాన "పరిమళం ఇల పరిచేము

గురువర్యా !
మీకు ఇదే మా ప్రమాణం..
మీకు ఇదే మా ప్రణామం...
( సెప్టెంబర్ 5 న డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా..)



–కోడిగూటి తిరుపతి
9573929493

# జీవన భాష లేని జీవితాలు వ్యర్థం






మనిషి ప్రాంతాలుగా, వర్గాలుగా, జాతులుగా, మతాలుగా, కులాలుగా ఆఖరికి మనిషి మనిషిగా చీలిపోయాడు. చీలిపోయి వాడిపోతు న్నాడు. భూమిని కోసేస్తున్నాడు, ఆకాశాన్ని భాగాలుగా చేసుకొని పంచుకున్నాడు. ప్రకృతిని చెట్లు చెట్లుగా మింగేశాడు. మనిషి ఎన్ని భాగాలుగా చీలిపోయిన, పంచభూతాలను నాశనం చేస్తున్న మనిషికంటూ ఒక భాష ఉంటుంది. మనం మాట్లాడే భాష కాకుండా మనిషికి జీవ భాష ఉ ంటుంది. ఆ భాష విశ్వవ్యాప్తం ఎదో తెలియని అనుభూతి, అందులో చలనం ఉన్నది, అదే గమ్యాన్ని నిర్దేసిస్తున్నది, మనిషిగా నిలబడటానికి ఇంకా కారణమై నిలిచింది. మనిషి పుట్టిన తర్వాతే భాష పుట్టింది అంతకు ముందు కొన్ని శతాబ్దాలు భాష లేదు మరి ఒకరి భావాలు ఇంకొరికి ఎలా తెలిసేవి అదే జీవభాష, జీవుడి భాష. మాట్లాడాల్సిన అవసరం లేదు మనలోని భావనలను ప్రకృతి సహాయంతో ఎదుటి వారికి చేరవేస్తుంది. ఇప్పుడు మనిషిది కేవలం భాష మాత్రమే అందులో జీవం లేదు. అందుకే ఇన్ని అఘాయిత్యాలు, మానవత్వం చచ్చిపోయింది, చలనం రావాలి. అదెలా సాధ్యం కేవలం అక్షరం ద్వారానే మనిషిలో జీవం పుడుతుంది.

కవులు కాలానికి అనుగుణంగా కవిత్వం రాయాలి. ఇప్పుడు ఉన్న సమస్యలు పక్కన పెట్టి ఎప్పుడో అనవసరమైన విషయాలపై అదేపనిగా కవిత్వం రాసి మత ప్రచారాలు, కుల సంఘాల సమీకరణలు చేస్తున్నారు. కవి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేయాలి. అలా కాకుండా వారి కవిత్వంతో ద్వేషాలు రెచ్చగొడుతున్నారు. కవికి హద్దులు లేవు ఒప్పుకుంటాను కవి చరిత్రలో జరిగిన తప్పులు కూడా నేటి ప్రపంచానికి తెలియ పరిచి చైతన్యపరచవచ్చు. అవగాహన లోపంతో తప్పు దోవ పట్టించడం, అదేపనిగా ఇతర మతాలను అవహేళన చేయడం జరుగుతోంది. ఒకరి వల్ల ఒక తప్పు జరిగితే అది ఆ వ్యక్తికి సంబంధించినది దాన్ని వదిలేసి ఆ వ్యక్తి వర్గానికో, ప్రాంతానికో, కులానికో, మతానికో ఆపాదించడం ఎంతమాత్రం సహేతుకమైన చర్య కాదు. దానివల్ల ఎలాంటి మంచి జరగకపోగా మనషుల్లో వ్యతిరేకత పెరుగుతుంది. కవులు సమాజాన్ని పచ్చగా చేయడానికి కృషి చేయాలి కానీ సమాజాన్ని విచ్ఛిన్నం చేయకూడదు.

గోపి గారి కవిత్వంలో వివాదాలు ఉండవు. సమాజాన్ని పచ్చగా చేసే ప్రయత్నం మొదటి పుస్తకం తంగెడుపూలు నుండి చేస్తున్నారు. జీవన భాష పేరుతో 2017లో కవితా సంపుటి విడుదల చేశారు. పుస్తకంలో 65 కవితలు ఉన్నాయి. పుస్తకంలోని కొన్ని కవితలను విశ్లేషణ మీ అందరి కోసం. "స్టీలు బాసాండ్లు అంటూ ఆమె పెట్టే కేక/ వొట్టి అరుపు కాదు/అదొక సంగీత శకలం/శ్రామిక లయ" ఇప్పటికీ మన పల్లెల్లో ఇంట్లోని పాత బట్టలు, మహిళల వెంట్రుకలు తీసుకొని స్టీల్ సామాను ఇస్తూ ఉండటం మనం గమనిస్తూనే ఉన్నాము. వారిపై రాసిన కవిత యొక్క ఎత్తుగడ పై వాక్యం. ఒక మహిళను ముప్పై సంవత్సరాలుగా గమనిస్తున్నానని ఆమె నేడు కనపడటం లేదని కవితలో ఉన్నది. నిజానికి వారి అరుపు పొట్ట కూటికి, దోపిడీ సమాజం చేసిన నేరం, సమానత్వం లేని సమాజానికి ప్రతీక. అటువంటి వారి అరుపును కవి సంగీత శకలం అన్నారు. మనిషి బతుకు పోరాటమే సంగీతం.

కాకిపైనా రాసిన కవితలో **"ఎంత అందమైన కాకి!/ సూర్యుడికి పోటీగా/ నల్లని వజ్రంలా మెరుస్తోంది/"**అన్నారు. సాధారణంగా కాకి అరుపును చికాకుగా భావిస్తారు, దాని ఆకారాన్ని సైతం ఎవరూ ఇష్టపడరు కానీ పిండం పెట్టడానికి వాడుకుంటారు. మనసు పెట్టి వినాలే కానీ కాకి అరుపులో కూడా సంగీతం దొరుకుతుంది. దాని నల్లని ఆకారం రాత్రికి ప్రతీకలా ఉంటుంది. అటువంటి కాకికి సూర్యుడితో పోల్చిన గొప్ప కవి, మనసున్న కవి, మానవత్వం ఉన్న అవి, అజేయమైన కవి గోపి గారు. ఓటమి అనే కవితలో కవిత రాయడానికి కవి పడే స్థితి గురించి రాశారు. నిద్రపోవడానికి ఉపక్రమిస్తే నిద్ర పట్టదని అక్షరాలు బుర్రలోకి వచ్చినట్టే వచ్చి పారిపోతాయని, మెత్తని దిండులా మారిపోతుందని అంటారు. అర్ధరాత్రి వేల అటు ఇటు ఎంత తిరిగిన వచ్చినట్టే వచ్చి కవితా దోబూచులాడుతుందని తెల్లవారగానే ఎక్కడి నుండి వస్తుందో తెలియదు కానీ అక్షరం అక్షరం కలిసిపోయి పదాలుగా వాక్యాలుగా కవిత్వంగా రూపాంతరం చెందుతుంది అంటారు.

నేటి కవులు నిమిషాల్లో కవిత్వం రాస్తున్నారు. అలా రాసిందే గొప్ప కవిత్వమనే భ్రమలో ఉ ండిపోతున్నారు. ఒక కవిత రాయడానికి కవి మనసు ఎంత తపన చెందాలి, ఎంత చలించాలి కానీ అలా జరగడం లేదు వందలు, వేల కవితలు రాసేసి నోరు తిరగని బిరుదులు పొందుతున్నారు. ఇక్కడ నేనేమి అతీతుడిని కాదు తొలినాళ్లలో ఇదే మాయలో పడినవాడినే అవి తెలియక వేసిన అడుగులే. కవి ఎంత తొందరగా తన బాధ్యత, స్వప్నం తెలుసుకుంటే అంత మంచిది లేదంటే ఈ సమాజం కవులను కూడా ప్రలోభ పెడుతుంది. అవార్డులు అంటుంది, రివార్డులు అంటుంది. కవిత్వం సమాజం కోసం రాస్తున్నాను అనే స్పృహ ఉండాలి కానీ తన వ్యక్తిగత ఎదుగుదల కోసం రాసే కవిత్వం ఎందుకు పనికిరాదు. అటువంటి కవిత్వాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. అసలు అటువంటి అక్షరాలకు కవిత్వ గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం లేదు.

స్థైర్యం అనే కవితలో అగ్గిపుల్ల గురించి రాస్తూ అసలు అగ్గిపుల్లలో వెలుగు ఎక్కడ ఉంటుంది. పుల్లలోనా, అగ్గిపెట్టె ఒంటి మీదేనా అని సందేహిస్తారు. అగ్గిపెట్టెలో అదే చివరి అగ్గిపుల్ల అని జాగ్రత్తగా వెలిగించమని హెచ్చరిస్తారు. వెలిగించడానికి ఆత్మస్థైర్యం కావాలని చెప్తారు. ఇక్కడ అగ్గిపుల్ల కేవలం ప్రతీక మాత్రమే. కవి చెప్పదల్చుకున్నది జీవితంలో ప్రతి సందర్భం ఎంతో విలువైనది. అవకాశామనే అగ్గి పుల్లను వెలిగించుకొని జీవిత దీపాన్ని చక్కదిద్దుకోవాలి. ప్రతి అవకాశాన్ని చివరి అవకాశంగా అనుకోవాలి దాని కోసం శ్రమించాలి ఇదే గోపి గారి ఉద్దేశం. గోపి గారికి కిటికీ అంటే చాలా ఇష్టం అది ఇంట్లో ఉన్న కిటికీ అయినా ప్రయాణం చేస్తున్నప్పుడైన కిటికీలో అనేక దృశ్యాలను చూస్తూ కవిత్వం రాస్తారు. ఒకసారి విమాన ప్రయాణంలో కిటికీ సీటు లభించలేదని బాధపడ్డారు. కిటికీ సీటులో ఉన్న ప్రయాణికుడు నిద్రపోతున్నాడు. కొంతమంది అంతే ఇతరులకు అవకాశం ఇవ్వరు వారు సద్వినియోగం చేసుకోరు. చివరిగా ఒక కవిత పుట్టక ముందే చనిపోయిందని చెప్పారు కానీ అదే విషయంపై నిరర్థకం శీర్షికతో కవిత రాశారు.

**"మీరు రాయకుండా/ వదిలేసినా కవితలను/ నేనిప్పుడు రాస్తున్నాను"** ఈ వాక్య అక్షర సత్యం. ఒక వ్యాసంలో నేనే చెప్పాను చాలా వస్తువులపై కవిత్వం రాలేదని. విమర్శకులు కూడా వస్తువులను పెద్దగా ఆహ్వానించడం కానీ, కొత్త వస్తువులు రావాలని గానీ సూచనలు చేయలేదు. అందుకే చాలా వస్తువులపై కవిత్వం రాలేదు. కొన్ని వస్తువులు నిర్లక్ష్యానికి గురైతే, మరికొన్ని వివక్షకు గురయ్యాయి. కవిత్వ పరంగా నాది కూడా గోపి గారి సిద్ధాంతమే అందరూ రాసిన వస్తువులపై కాకుండా కొత్త వస్తువులపై, నేటి సమాజానికి అనుగుణంగా కవిత్వం రాయాలనుకుంటాను. అదే "వై" పేరుతో హిజ్రాలపై దీర్ఘ కావ్యం రాయడానికి కారణం. నేడు గోపి గారు రాసిన వస్తువులు చరిత్రకు ఆనవాలుగా నిలుస్తాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇంకా కొత్త వస్తువులపై కవులు కవిత్వం రాయాలని సాదరంగా ఆహ్వానిస్తున్నాను.

అసంపూర్ణ కవిత శీర్షికతో ఒక కవిత రాశారు గోపి గారు. ఇందులో ఒక యువ కవి తన దగ్గరికి వచ్చి కవిత వినిపించాడని అది నాకు అర్థం కాలేదని చెప్పడం జరిగింది. నేను చాలా వ్యాసాల్లో ఇప్పటికీ దీనిపై రాసాను. కవిత రాసి దానికి వివరణ ఇస్తున్నాము అంటే రీడర్ హృదయాన్ని మనం చేరుకోవడం లేదనే అర్థం. అలా కాకుండా ఏది పడితే అది రాసి నా కవిత్వమే గొప్ప అని జబ్బలు చరుచుకునే వారికి ఈ కవిత ఒక హెచ్చరిక లాం టిది. కవి కవిత్వం రాసేది రీడర్స్ కోసం. రీడర్స్ కి చేరుకోలేని కవిత్వం అసంపూర్ణ కవిత్వమే అవు తుంది. ఈ పుస్తకంలో ఎక్కువగా సమాజాన్ని మేలు కొలిపే కవిత్వం కనపడింది. హితాన్ని చెప్పే ప్రయ త్నం చేశారు అనిపించింది. చేదబావి, కొండమీద గుడి, పన్ను, గడ్డి, వడ్లు, పార, బల్లి, ముగ్గులు, స్మశానం దుకాణం లాంటి కొత్త వస్తువులపై కవిత్వం రాశారు. జీవ భాషను, మనిషి భాషను తెలు సుకోడానికి పుస్తకాన్ని చదవమని ఆహ్వా నిస్తున్నాను.



-అఖిలాశ
7259511956

## పసి పాపడు

ఒకప్పుడా కళ్ళు
సూర్య గోళాల్లా మెరిసిపోయేవి
జ్ఞాన జ్యోతుల్లా వెలుగులీనుతు
విజ్ఞాన కిరణాలు వెదజల్లుతూ..

ఆ నవ్వు
విరబూసిన వెన్నెల్లా వుండేది
గలగలా పారే సెలయేరులా
స్వచ్ఛంగా పేరుకున్న పాలనురగలా..

ఆ కంఠం
కంచులా ధ్వనిస్తుంటే
పాఠం
నా మెదడు పొరల్లోకి చొచ్చుకుపోయేది.

ఆ చేతులు
అభయ హస్తాల్లా
ఆప్యాయతను వర్షిస్తు
నేనున్నాని భరోసానిస్తు...
ఆ అడుగుల వెంబడి
నా నడక–నడత
నా భవితకు
ఆ స్ఫూర్తే పెట్టుబడి
ఎప్పుడో.. ఏబయి ఏళ్ళ క్రిందటి మాట
మరి యిప్పుడేమిటి... యిలా?
నెలల పాపను ఎత్తుకున్నట్టు
చేతులపై మోసుకొస్తున్నారు?
పెదాల మీది
చెదరని ఆ నవ్వు
అలంకరించిన ఆభరణంలా వుంది.

పత్తి కాయల్లా
కళ్ళు అటు యిటు కదలాడుతూ
ఎవ్వర్నీ పలకరించడం లేదు
ఆ కను పాపల్లో దూరి మరీ అరుస్తున్నాను
గుర్తు పట్టినట్టు లేదు
అదే పనిగా చూస్తున్నాడు తప్ప
ఎనభై ఏళ్ళ
ఆ పసిపాపడు
పదాలు పొందిన సిద్ధుడిలా వున్నాడు
బంధాలు తెంచుకున్న సాధువులా వున్నాడు
కాలాన్ని వెనక్కి మళ్ళించి
పసితనంలో ఒదిగిపోయిన
పరమ యోగిలా వున్నాడు.

ఆ చేతుల్తో
నా బుగ్గల్ని నిమురుకున్నాను
చెమరుస్తున్న నా కళ్ళు
తడుముతున్న ఆ వేళ్ళు!!
( 'అల్జీమర్స్' బారినపడిన మా గురువు డా॥జి.సోమేశ్వరరావుగారిని చూసి...)



- రమణ వెలమకన్ని
సెల్: 9866015040



## గాంధీయత

ఆ 'కర్ర ' పోటు
తెల్లదొరలకు గుండె పోటు

ఆయుధాన్ని తాకకుండా
అణిచివేసె తుపాకీ దర్పాన్ని
బోసి నవ్వుల 'బాకు' తో
పారదోలె శ్వేత సర్పాన్ని.

సత్యాగ్రహ గాత్రమై
సమరశంఖం పూరించే
బక్క మనిషి ఒక్కవాక్కు
భారతావనిని నడిపించె.

ప్రజల నాల్కలపైన వదిగిపోయిన బాపు
ఎవ్వరూ చేరలేదాకీర్తికి దరిదాపు.

నిత్య నిరాహారదీక్షలే ఆహారం
సత్య పరిశోధనలే విహారం.
సర్వవ్యాప్తమాయె మమతా,నిగ్రహాలు
జగమంతా అందుకే ఆ మనీషి విగ్రహాలు.

హింసా జ్వాలల్లోనే
నడయాడిన శాంతిదూత
మనిషి మనుగడ వున్నదాక
మరువలేరు 'గాంధీయత'.

భావితరాలకిదో చింత
'బాపూజీ' జీవితం
నమ్మలేని వింత.



-మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

## పుస్తక సమీక్షలు

# విలక్షణ అభివ్యక్తితో రూపుదిద్దుకున్న అంజయ్య కవిత్వం!

చక్కని భావుకతతో.. విలక్షణమైన అభివ్యక్తితో సీనియర్ కవి కొమురవెల్లి అంజయ్యగారు చాలా కాలం తర్వాత.. మళ్లీ **"నడక బోనం"**తో మన ముందుకొచ్చారు. తాను విద్యాభ్యాసం చేసే రోజుల్లోనే కథలు, కవితలు, వ్యాసాలు రాసిన అనుభవమున్న ఆయన.. 1981లో **"గీతాయుధం"** కవితా సంపుటిని వెలువరించారు. సిద్ధిపేట మంజీర రచయితల సంఘంలో వ్యవస్థాపక కార్యదర్శిగా క్రియాశీలక సాహిత్య సేవలందించిన అంజయ్యగారు లోగడ 'భారతి' మాస పత్రికలో అనేక రచనలు చేశారు. "ఊపిరి" బులిటెన్ల ప్రచురణలో ప్రముఖ పాత్ర పోషించారు. 1983లో పత్రికా రంగంలో పాత్రికేయునిగా ప్రవేశించి.. ఇప్పటికీ పాత్రికేయునిగా కొనసాగుతూ అందరి దృష్టి నాకర్షించేలా వార్తా కథనాలు అందించడం అభినందనీయం! ఆయన **'చైతన్య సాహితి'** సాహిత్య సంస్థను ప్రారంభించారు. కొంత కాలం 'సాహితీ వికాస మండలి'కి కార్యదర్శిగా కూడా బాధ్యతల్ని నిర్వర్తించిన అనుభవం ఆయనకుంది. అనేక సంస్థల ద్వారా సన్మాన సత్కారాలతో పాటు పురస్కారాలను అందుకున్న ఆయన పత్రికలకు వార్తలు రాయడమే కాదు.. పలువురు కొత్తకవులు, రచయితలకు మార్గ దర్శకంగా ఉండే విధంగా.. వివిధ పత్రికల్లోనూ.. అంతర్జాలంలోనూ అద్భుతమైన కవిత్వాన్ని పండించడం విశేషం! ఆలోచనాత్మకంగా ముఖచిత్రంలో.. ఆయన ఇప్పుడు మనకందిస్తున్న 'నడక బోనం' గ్రంథంలో 70 కవితలు చోటు చేసుకున్నాయి.

వస్తు ఎంపికలో వైవిధ్యం.. అభివ్యక్తిలో నవ్యతను పాటిస్తూ.. ఇందలి కవితలకు జీవం పోశారు. పాత్రికేయ రచయితగా సదా సమాజంలో మమేకమైపోయే ఆయన.. తన కవిత్వంలో సమకాలీన సంఘటనలకు పెద్దపీట వేస్తూ.. సామాజిక సమస్యలను ప్రతిబింబింపజేస్తూ తన అనుభవాన్నంతా రంగరించి ఇందులోని కవితల్ని తీర్చిదిద్దారు.

ఆయన కవిత్వంలో.. ఆయన భావావేశంతో పాటు. సామాజిక చింతనను చూడగలం. ఆక్రోశ ఉక్రోశాలే కాదు.. ఆలోచింపజేసే అనేక అంశాలను కవిత్వంలో బంధించారు. పదబంధ ప్రయోగం చక్కని ఔచిత్యం పటించే సుగుణం వున్న అంజయ్యగారు ప్రతి కవితలో పైకి అలతి అలతిప దాలుగా కనిపించినా.. ఎంతో లోతైన భావాలను ప్రకటించడం ప్రశంసనీయం.. సందర్భోచితంగా తెలంగాణ భాషకు పట్టం కడుతూ తన అంత రంగంలో గుట్టుగా.. గుట్టగా కదలాడే ఆలోచనలకు అక్షరాకృతినివ్వడంలో అంజయ్యగారు సఫలీకృతుల య్యారు. ఆయన కవిత్వంలో మసక బారుతున్న మానవ సంబంధాలకు మెరుగులు దిద్దాలన్న ఆరాటం.. సామాజిక చైతన్యం కోసం తన అక్షరం ముందుం డాలన్న సంకల్పం.. అడుగడుగునా కానవస్తుంది.

ఆయన కవితా పంక్తులు పరోక్షంగా పాలకులను నిలదీస్తాయి. ప్రత్యక్షంగా పేదల బాసట నిలుస్తాయి. కవి అంజయ్యగారు తన కవితలకు శీర్షికలు పెట్టడంలో నేర్పరితనాన్ని ప్రదర్శించారు. ఎత్తుగడలో వైవిధ్యాన్ని చాటారు. కొనసాగింపు.. కవిత్వ నిర్మాణ క్రమంలో.. తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారు. ఆయన ఆయా కవితల్లో ప్రయోగించిన పదబంధాలు ఇట్టే కవితల్లో చక్కగా ఒదిగిపోయాయి! ఆయన కవితా పంక్తులు.. బంధం మౌన లేత తమలపాకు మృదుత్వమై.. వాక్యాల మధ్య ఆగి సాగే చుక్క కావాలని కాంక్షిస్తాయి.

కొద్దిసేపు మౌనానికి తోరణాలు కట్టాలని హితవు పలుకుతాయి! మనసుకంటిన మసి కడుక్కునేందుకు మమతల్ని మనుమరాలిలా గుండెలకు హత్తుకోవాలని సూచిస్తాయి. తడారని మనుషుల్లా బతికేందుకు ఆయన కవితా పంక్తులు బాటను చూపుతాయి! అంతేగాక.. మనం మనుషులమైతే.. మనలో బాల్యం బతికుండాలని హితబోధ చేస్తాయి! ఖైదీ కాని కవివైతే.. బానిస కాని బతుకైతే.. నిరంతర ఉత్తేజంతో బాల్య సముద్రాల అలలు పొంగాలని ఆయన కవితా పంక్తులు విడమరిచి చెబుతాయి.

**'నడక బోనం'** కవితను ఎత్తుకున్న తీరు చాలా బాగుంది. తెల్లవారంగనే.. నడక బోనమెత్తుకుని బయలుదేరుతా.. అంటూ చక్కగా ప్రారంభించారు.






నడక యొక్క ప్రాశస్త్యాన్ని చాటుతూనే.. నడక చేస్తున్నప్పుడు పొందే అనుభూతులను కవితాత్మకంగా దృశ్యమానం చేశారు. నాగరికత పాతదైనా.. కొత్తదైనా.. నడక సూత్రానికి లక్ష్యం జోడెద్దయితే.. జన జాగరణ పదాల పాదయాత్ర.. ఒకటి పక్కన అంకెల చుట్టరికం అంటూ ఆలోచనాత్మక ముగింపు నిచ్చారు.

**'వలస గతుకులు'** కవితలో "వలసజీవుల వ్యథలకు అద్దంపట్టారు. దేశం పేరేదైతేనేం దూప ఆర్పని దుబాయి బతుకు.. కరువు తీర్చని కష్టం అతుకు" అంటూ కొనసాగించిన పంక్తులు చాలా పొందికగా కవితలో ఒదిగిపోయాయి!

**'బతికున్నామా?'** కవితలో కవి యొక్క భావావేశాన్ని చూడగలం.. పల్లె పసి మనసుల్ని మాయం చేస్తున్నా.. మెడవిరిచిన వరికంకుల్లా ఊగుతున్నాం. నిద్ర నటించడంలో అవార్డు గ్రహీతలం అంటూ వ్యాఖ్యానించడం బాగుంది.

**'అయ్యోపాపం'** కవితలో రైతన్నల కష్టాలు ఏకరువు పెట్టారు.

అక్షరం ముక్కల్నినోట కరుచుకుని నేను ఎగిరే పక్షినవుతా.. పక్షి గొంతులో రాగమవుతా అంటూ **'నా అక్షరం'** కవితను తీర్చిదిద్దారు. వయస్సు ఏదైతేనేం.. వలపు ఎంతుంటేనేం.. శరీరం ఉరక లేయకపోతే.. భవిష్యత్తు బరిబాతల ఉన్నట్లే నం టూ.. **'బతుకు తెగితే'** కవితలో కవి ప్రకటించిన భావాలు.. ఆయన కలం యొక్క బలాన్ని సూచించేలా కొలువుదీరాయి!

కలల పాలు తోడేసుకుని ఆకాశానికి నిచ్చెన వేయాలని **"పోరాటం"** కవితను చక్కగా ప్రారం భించారు. చివరలో కవి స్పందనల శిఖరం కావా లనీ.. బాధల లోగిళ్ళలో పాదరసంలా పారాలనీ. కవిత్వం శ్రమ సౌధం.. అధికారం ఆశించని అంకుశం కావాలని.. మొత్తానికి విశ్వానికి మనం మనుషులం కావాలని సూచించడం బాగుంది.

**'ప్రయాణం'** కవితలో బస్సు ప్రయాణంలోని పదినిసలును అక్షరాల్లో అందంగా బంధించారు. కదిలే ప్రతిక్షణం మనది కాదని.. కనిపించే ప్రతిరూపం హత్తుకోదని తేల్చి చెప్పారు.

నర్మగర్భంగా దినచర్యకు సంబంధించిన భావాలను పంచుకుంటూ **"నిద్రలేచిన దినం"** కవితను రాసిన తీరు బాగుంది.

మమతల జీవనదుల తొవ్వ నాకు ఆరాధ్యం అంటూ **"తొవ్వ"** కవితను రాశారు.

**"పాఠం'** కవితలో.. నేను అక్షరాలు నాటేసే వాన్ని.. కవిత్వం పంటలు తీసేవాన్ని.. కొనగోటిపై విశ్వాసం.. జీవమున్నవాన్ని అంటూ రాసిన పంక్తులు కవి యొక్క స్వాభిమానాన్ని చాటే విధంగా ఉ న్నాయి!

రైతన్నలను.. నేతన్నలను ఉద్దేశిస్తూ రాసిన **'ఆత్మల హత్యలు"** కవితలో.. మగ్గం.. నాగలి తోబు ట్టువులని ఉరిని ముద్దాడే అల్ప జీవులని వాపోయారు.

**'చౌరస్తా'** కవితలో తెలంగాణ ఉద్యమ కాలం నాటి అనుభవాలను నెమరు వేసుకున్నారు. ఎవరైనా దారులు మూయొచ్చు.. ధర్నాచౌక్‌లు ఎత్తేయొచ్చు.. నడింట్ల నందదీవం వెలుగు చౌరస్తాలు మూసేయడం తరమా! అని ప్రశ్నించారు. ఏరుకునే అక్షరాల గొంతు కూరుకుపోకుండా గంటలా మ్రోగాలని.. పదాలు పాటలై రాగాల ముంగిట్లో తేనేలూరాలని.. నడిస్తే నాలుగు చెమట చుక్కలు.. జీ హుజూర్ అనని కవిత్వ సాగరం "కావాలి" అని కాంక్షిస్తూ మరో కవితనను రాశారు.

కూల్చడం కాదు.. నా లక్షణం నిల్పడం.. నేను మూడే కాలునే కానీ.. వంచితే విల్లునవుతా.. నిల బడితే జాతికి జెండానవుతా.. అంటూ "చేయూత కర్ర"ను సైతం కవి కవితాత్మకంగా ఆవిష్కరించారు.

**'చలిగిలి'** చలి యొక్క గిలిగింతలను అందంగా చిత్రించారు.

కార్పొరేట్ చదువులపై ధ్వజమెత్తుతూ తమ కలాన్ని సంధించారు. **'సంతలో సదువులు'** కవితలో కవి ప్రకటించిన భావాలు నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టేలా ఉన్నాయి. **"పట్నం బాధ"** కవితలో పట్నం బాధలను అక్షరబద్ధం చేశారు.

**'తొలి మలి సంధ్యారాగం'** కవితలో.. తొలిమలి సంధ్యల నడుమ , చిరునవ్వుల కౌగిట్లోని చీకటిని చక్కగా ఆవిష్కరించారు.

**'వృద్ధాప్యం'** కవితలో వృద్ధాప్యపు ఛాయలను ఆర్ద్రంగా చిత్రించారు.

తలపుల వంతెన కడితేనే కదా రేపటి రూపా లకు శంకుస్థాపనలు.. తలపుల కోటను అధిరోహి స్తేనే కదా.. కవి జాతి జెండాను ఎగరేసేది అంటూ **'తలపుల వడిశెల'** కవితకు చక్కని ముగింపు పలి కారు. **'తేల్చుకో'** కవితలో కవి యొక్క భావా వేశాన్ని చూడగలం. **'మిగిలిందొక్కటే'** కవిత అందరినీ కదిలించేలా ఉంది. పెద్ద పెద్ద సదువుల్లోళ్ళు.. పెద్దరికాలు చేసేటోళ్లు.. ప్రేమ గళ్లోలన్న కిరీటాలు.. అన్నీ ఉన్నా అమ్మ నోట్లో శని" అంటూ రాసిన పంక్తులు బాగున్నాయి! ప్రముఖ ధ్వన్యనుకరణ కళాకారుడు వేణుమాధవ్‌గారికి నివాళి సమర్పిస్తూ రాసిన కవిత **'వేణు మాధవా"** లో వేణుమాధవ్‌గారి పట్ల కవి తమ గౌరవాన్ని చాటుకున్నారు.

**'చినుకులుంటేనే'** కవిత ప్రారంభ పంక్తులు చాలా బాగున్నాయి. చినుకు సురుక్కుమని పల కరిస్తేనే కదా మెదడు దుక్కికి నాగలి తలంటేది" అంటూ కవితాత్మకమైన ఎత్తుగడతో ప్రారంభిం చారు. మౌనం అంటూ పరధ్యానం కాదు.. ఆలో చనల అగ్నిపర్వతం.. ఎత్తుగడలను సంధించే ఎక్కు పెట్టిన ఆయుధమంటూ **'మౌనభాష'** కవితకు రూప మిచ్చారు.

కవివైతే నిత్యం జీవించాలి బాల్యంలో అంటూ బాల్యం యొక్క మధురిమలను.. మధుర స్మృతులను **"బాల్యం ముగ్గు'** కవిత ద్వారా మనతో పంచుకున్నారు.

మొక్కలు నాటే చప్పట్లు.. రూపం మారి చెట్లయితేనే కదా పండుగ" అంటూ **"ధ్వంస రచన నుంచి"** కవితలో రాసిన పంక్తులు చెట్టును కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేసేలే ఉన్నాయి!

**"నీడలో వెలుగు"** కవిత ద్వారా మనమెప్పుడు వెలుతురు వీధుల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. ఇలాఈ గ్రంథంలోని కవితా పంక్తులెన్నో ఉ దహరించడానికి యోగ్యంగా ఉన్నాయి.

అంజయ్యగారి కవిత్వంలో మనసును మురి పించే శిల్పం ఉంది. పదచిత్రాలు. ..ప్రతీకలు.. విరుపులు. మెరుపులు.. ఎత్తుగడ.. కొనసాగింపు.. ముగింపులు ఏది ఎంత మేరకు అమరాలో అంతే అమరేలా జాగ్రత్త పడ్డారు. భావ అభివ్యక్తిలో తనకంటూ ఓ ఒరవడిని పాటించారు. సామాజిక చింతనతో ఓ గొప్ప అనుభూతిని పంచేందుకు కవి చేసిన ప్రయత్నం ప్రశంసనీయం.. విలక్షణమైన వ్యక్తీకరణతో తనదైన శైలిలో కవిత్వాన్ని పండించిన కవి అంజయ్యగారికి అభినందనలు తెలుపుదాం.

ప్రతులకు: జైత్ర పబ్లికేషన్స్
8-2-268/1/బి/12
అరోరా కాలనీ, రోడ్.నెం.3
బంజారాహిల్స్,
హైదరాబాద్-500 034
సెల్: 9989528112



- దాస్యం సేనాధిపతి
94405 25544

# ఓ మంచి బతుకమ్మ మా తల్లి నీవమ్మ



ఓ మంచి బతుకమ్మ, మా తల్లి నీవమ్మ
నీ కండ్లల్ల తేజస్సు, చూపులల్లా ప్రేమ
మా బతుకులల్ల ఎలుగులెన్నో నింపి
మమ్ములను కాపాడే నిండు దీపాలమ్మా

మా సదువులే కాని, మా కొలువులే గాని
మా కుటుంబాల బాగోగులే గాని
నీ కరుణా కటాక్షాల భిక్షనే గదమ్మ
నీ దయా దాక్షిణ్యాల పూలజల్లేనమ్మ ఓ మంచి బతుకమ్మ మా తల్లి నీవమ్మ ?

తీరొక్క పూలతో బతుకమ్మనలంకరించి
ఆడపడుచులందరం రంగు రంగుల దుస్తులు కట్టి
నిన్ను కొలుసుకుంట ఆడంగ పాడంగ
మా కోర్కెలన్నీ దీర్చి కరుణించవమ్మా ఓ మంచి బతుకమ్మ మా తల్లి నీవమ్మ?

అలంపూర్ శక్తిమాత, ఓరుగల్లు భద్రకాళి
మావూరి పోశవ్వ, కట్టమీది మైసమ్మ
ఉజ్జైని మహాంకాళి, బాసర భారతమ్మ
పేర్లు ఏవైనా అంతటా నువ్వేనమ్మా. ఓ మంచి బతుకమ్మ మా తల్లి నీవమ్మ ?



– అంబల్ల జనార్దన్
08850349858

## బతుకమ్మ

బహుళ వన్నెల
బహుచక్కని బతుకమ్మలు
నవరాత్రుల సందడి
నవ్య కాంతుల దుర్గమాత

బహుజనులు గూడి
బహువిధాల ఆటలాడి
బహుచక్కగను
భవితనూహించెదరు

ఇస్తినమ్మ వాయనం
పుచ్చుకొంటి వాయనమంటూ
ముత్తైదువలంతా
మురిసిపోదురు.

–సుతారపు వెంకటనారాయణ
9848958690

# నవదుర్గా నమోస్తుతే

కం॥ జగదీశ్వరి పరమేశ్వరి నిగమాగమ వినుతశక్తి నీరూపంబున్
జగమంతయు పూజింతురు భగవతి శ్రీ.శైలపుత్రి భాగ్యములిమ్మా

కం॥ మా వేల్పు బ్రహ్మచారిణి దేవి ముగురమ్మలమ్మ దేదీప్యముగన్
ఈవే యష్టార్థంబులు నీవే మాదిక్కు మొక్కు నిక్కము జననీ.

కం॥ ఓంకారంబున వెలుగుచు శ్రీంకారీ చంద్రఘంట సిరిసంపదలన్
హ్రీంకారీ మమ్మేలుము క్లీంకారీ దుర్గమాత కీర్తిన్ లెపుడున్

కం॥ పద్మాభ్యాం కూష్మాండే పద్మప్రియ చంద్రవదన పద్మిన్యేశ్రీ
పద్మోద్భవ దేవీ రమ పద్మాసన పద్మరాగ భాసుర మకుటే.

కం॥ స్వర్గాదిలోకవాసులు దుర్గే శ్రీస్కంద మాత దుర్లభరూపే
నిర్గయ నిగముమమత భర్గే శ్రీమాత గౌరీ భద్రము నిమ్మా

కం॥ సర్వేశ్వరి కాత్యాయిని సర్వాభీష్మ ప్రదాయి సత్ఫలదాయా
సర్వం నీ ఆధారమె సర్వాత్మికె సర్వరూపి సంస్తుతిజేతున్

కం॥ వరదాయీ శుభదాయీ నారాయణి కాళరాత్రి నవదుర్గాంబా
పరదేవత కామాక్షీ నిరతము వినుగొల్తు మమ్ము నిహపరములకున్

కం॥ శ్వేతాంబరధరి గౌరీ మాతా సౌభాగ్య భాగ్య మహిమోపేతా
కాత్యాయిని తేజోవతి కాంతా కామాక్షీదుర్గ కామిత మిమ్మా

కం॥ సిద్ధ సురాసుర పూజిత సిద్ధిప్రద సిద్ధరాత్రి శ్రీనవదుర్గా
సిద్ధించెను మా కోర్కెలు బుద్ధిగ వినుగొల్చినంత పురుషార్థంబుల్.



– డా॥కే. బాలస్వామి
9959653115

# యురేనియమా–ఉరిపాశమా

గుప్పెడునీ"యురేనియము" కోసము గుట్టలనెల్ల గూల్చి పెన్
ముప్పు ఘటిల్లజేయుటది మూర్ఖత కాదొకొ "మానవా"! యిదే
తప్పునొనర్చి మున్ "బ్రెజిలు" దండననందుట చూచికూడ "కన్
విప్పు" కలుంగకున్న నిక భీకరమైన దవాగ్ని చెల్లదే!

పేరున్ మోసిన నగ్రరాజ్యములె బెంబేలెత్తి చాలింపగా
"పూరా"శక్తిని పొందనట్టి మనకా ముప్పెంత భీభత్సమో
వేరే చెప్పగనేల!మృత్యుసమమౌ విజ్ఞానమున్ బొంది యే
తీరున్ సౌఖ్యమునందగల్గుదుమొ బుద్ధిన్ బెట్టి యోచించుమా!

బయటకు తెచ్చి పంచిన నపాయకరమ్మునటంచు నెంచియే
స్వయముగ నేలతల్లి కడుభద్రముగా తన గర్భమందునీ
భయద"యురేనియమ్ము"నిక బైటికి తేక నడంచియుంచ,వి
స్మయముగ దానితవ్వుచు ప్రమాదములన్ గొనిదెత్తురేలకో!

గాలిన్నీరములందు జేరుచు మహాకాలుష్యభూతమ్ముగా
నేలన్ ప్రాణుల జీవనమ్మునకె హానిన్ గూర్చి, యారోగ్యముల్
కాలన్ రాచు "యురేనియమ్ముల రియాక్టర్లిట్లు" నిర్మింపగా
ఏలాతొందర నోయి పాలకుడ!నీకే చింత లేదేలొకో!

"యురేనియమ్ము" నిల్వలంచు నుర్విపైన కొండలన్
హరింపజేయు యత్నమెల్ల హానిజేయుటేగదా!
భరింపలేని రుగ్మతల్ ప్రభావమంతజూపగా
మరింకనిట్టి యోచనమ్ము మానుకొన్న క్షేమమౌ!

క్రూరమౌనణుధార్మికమ్మను ఘోరశక్తికి మారుగా
"సౌరశక్తి" తయారుచేసిన సత్ఫలమ్ములనిచ్చుగా!
నీరు,గాలియు,చెట్టుచేమల నిర్మలత్వము గాల్చుచున్
కోరి కొర్విన నీ శిరమ్మిక గోకుకోకయ మానవా!

"చెర్నోబిల్లు"నుదంతమొక్కటియె సాక్షీభూతమై చాలగా
"ధర్మామత్తు" ని కల్లబొల్లికబురుల్ ఢంకాబజాయింతువే
ధర్నాల్,దీక్షలు, ప్రాణమొడ్డియయినన్ దౌష్ట్యమ్ము లన్నడ్డుచున్
నిర్నిద్రాయుతులై ప్రజల్ నిలుతురగ్నిజ్వాల చల్లార్పగా!

పరవళ్ళకృష్ణమ్మ ప్రవహింపనిచ్చోట
నిత్యముప్పొంగేను నీటియూట
వన్యమృగములెన్నొ యన్య మెరుగకుండ
వగలుపోవునిచట పగటిపూట! "ముక్కంటి"కోసమై మునిజనులిచ్చోట
తరలిపట్టెదరింక"తపము"బాట
ప్రకృతిమాతకు ముద్దుబాలలై మెలిగేటి
కోయచెంచులకిద్ది కూర్మిపేట

ఔషధులు ,తరువులకాలవాలపు "ఘాటు"
"మల్లికార్జున"మహిమంబు చాటు
దివ్యగిరులు కొల్వు దీరినదీ చోటు! అట్టి"నల్లమలకు" "నణువు" పోటు!

కొండలెల్ల పిండిగొట్టగలరు గాని
చేతనవునె మనుజ జాతికిలను
చిన్నికొండనైన సృష్టిజేసెడి యుక్తి!
ప్రాణమొసగ గలుగు పరమశక్తి!

ప్రకృతినెల్ల నష్ట పరచి నీవాసగెడి
వెలుగులెవరికిచట వలయునోయి!
విషముజిమ్ము నట్టి "విపరీత శక్తికై"
కొల్లగొట్టబోకు "నల్లమలను"!



–ఎస్ సాయిప్రసాద్
9440470774

# ఒక వాక్యాన్ని వెలిగిద్దాం రా!

ఇంకా చూస్తావేం రా!
కలాల జ్వాలల్ని
శాలువా కప్పి ఆర్పలేరని
ఒకమారు జ్వలించి చూపుదాం పద
గళాల గొంతుల్ని
ఒక అవార్డిచ్చి నొక్కేయలేరని
ఒకమారు ప్రతిధ్వనించి చెబుదాం పద
బంగారు గుడ్డుకు ఆశపడి
అడవి గర్భాన్ని చీల్చేస్తుంటే
మీనమేషాలు లెక్కిస్తావేం రా!
అభివృద్ధంటే అడవిని
అంతంచేయడం కాదని
నెత్తికెత్తిన కళ్ళకు
ప్రపంచ పాఠాలు నేర్పిద్దాం నడు!

నువ్వు ముళ్ళుగుచ్చుకుని
'అమ్మా!..' అని ఆక్రోశించినప్పుడల్లా
అడవి కొన్ని ఆకుపసరులు పూసింది
ఇప్పుడు అమ్మ గుండెల మీద
'మైనింగ్' గాయాలు...
పేగులు తెగిపడేలా గేయమొకటి రాద్దాం నడు!
నల్లమలంటే
ఒక అడవి కాదు
నల్లమలంటే
ఆంధ్రో తెలంగాణో కాదు
నల్లమలంటే ఒక ఆకుపచ్చ దేశమని చెప్పు!

నా దేశపు దేహం మీద
ఒక్క పచ్చనాకు తెగిపడ్డా
వేల వేల అక్షరాలై విరుచుకుపడతానని చెప్పు!
నా దేశపు మట్టిని కౌగిలించుకున్న
ఒక్క రాయి ప్రక్కకు తొలగినా
కోట్ల కవి సమూహాన్ని గర్జిస్తానని చెప్పు!

ఇంకానా...
ఇంకా నక్కుతావేం రా!
నల్లనిమేఘం మాటున
సూరీడు
అదృశ్యమవ్వక మునుపే!
తెగించి ఒక వాక్యాన్ని వెలిగిద్దాం రా!



– సాంబమూర్తి లండ
9642732008

# తెలుసుకో!

మత్లా: పరస్త్రీల మోహించుట పతనం అని తెలుసుకో ॥పర॥
పరుల ఆస్తి కాజేయుట నేరం అని తెలుసుకో ॥పర॥

కనిపెంచిన తలిదండ్రుల కడకు వృద్ధాప్యంలో
కానకుండ వదిలేయుట పాపం అని తెలుసుకో ॥పర॥

అతి గారాబలతోడ సంతతినే పెంచేస్తే
క్రమశిక్షణ చదువురాక వ్యర్థం అని తెలుసుకో ॥పర॥

అర్థం–అతివా యిలలో గోప్యంగా వుంటేనే
భద్రత సమకూరే పరమార్థం అని తెలుసుకో ॥పర॥

అతినిద్రా–అతిగతిండి అలవాట్ల పడిపోతే
ఆరోగ్యం–సకలకార్యభంగం అని తెలుసుకో ॥పర॥

అధికారులు–పాలకులు ప్రజలగోడు విని వెతలను
అణగిస్తేనే 'ప్రజాస్వామ్యం' అని తెలుసుకో ॥పర॥

మక్త: తవినీతి–బంధుప్రీతి తొలగిస్తే 'వద్దెపల్లి'
వర్ధిల్లును దేశ సౌభాగ్యం అని తెలుసుకో ॥పర॥



– డా॥వద్దేపల్లి కృష్ణ
9246541699

# మన జాతిపిత మహాత్మాగాంధి

హిమాలయపర్వతంలా ఉన్నతంగా
ఆధ్యాత్మిక గురువులా సంయమనంతో
మదమతిప్పని వీరుడిలా ధైర్యంగా
అహింసను ,పోరాటాన్ని కలబోసి
మొక్కవోని ఆత్మవిశ్వాసం తో
రవి అస్తమించని
విశాలసామ్రాజ్యం కలిగిన
బ్రిటీషు పాలకులదురాగతాలను కట్టడిచేయ,
ఎదుర్కొని నిలబడి
పోరాటస్ఫూర్తిని చివరివరకు సడలనియ్యక
స్వాతంత్ర్యసంగ్రామములో
మహాత్మా గాంధి మనకు నాయకుడై
సత్యాహింసలే మార్గంగా
సత్యాగ్రహమే ఆయుధంగా
బ్రిటీషు సామ్రాజ్యవాదశక్తిని
గడ గడ లాడించి
సహాయనిరాకరణ ఉద్యమంతో
పరపాలన కొమ్ములు వంచి
పోరాటాన్ని పల్లెపల్లెకు విస్తరింపజేసి
ఉప్పుసత్యాగ్రహంతో
ప్రజా వ్యతిరేక
చట్టాలను ఉల్లఘించి,
క్విట్ ఇండియా ఉద్యమంతో
బ్రిటీషు పాలకుల గుండెల్లో దడపుట్టించి,
భారతదేశాన్ని పరిపాలించడం కష్టమని
తెల్లదొరలకు తెలియజేసి,
మనదేశం వదలి వెళ్ళవలసిన దుస్థితికల్పించి,
బ్రిటీష్ జండాను దింపి
మనజండాను రెపరెప లాడించిన,
అలుపెరుగని పోరాటయోధుడు,
గాంధి మహాత్ముడు,అందుకే అయ్యాడు,
మన జాతిపిత



–ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

# వీర కిశోరం సర్దార్ పాపన్న

నవాబుల పాలనలో ప్రజలు
కష్టాల కొలిమిలో కాలిపోవటం
కనులార కాంచినవాడు
దోపిడీల లోయల్లోపడి
బ్రతుకుదార్లు వెతుక్కునే
ప్రజల కన్నీటి మడుగుల్ని తిలకించిన వాడు
కొడితే గోల్కండనే కొట్టాలని
దీక్షాకంకణం ధరించినవాడు
పట్టుదల, సాహసాలు, నేత్రాలుగా
మనో సంకల్పానికి జీవం పోసినవాడు
మిత్రులతో కూడి, ఉద్యమమై మెరిసి
పోరాటశక్తిని సమీకరించిన వాడు
కామ వాంఛలకి తలొగ్గొద్దని
మద్యం మత్తునుజయించమని
తోటి జనులకు సందేశమిచ్చినవాడు
తల్లిమాటకి, చూపెడి బాటకి
ఆమడ దూరాన్న నిలిచి
ఆమె మదిలో తన మనోభీష్టాన్ని
చెదరని శిల్పంగా చెక్కినవాడు
కులవృత్తిని విడిచిపెట్టి
కత్తికి పదును పెట్టినవాడు
పౌరుష ప్రతాపాలకు మారుపేరై
వీరులను కూడగట్టిన నాయకుడు
పట్టుదలను అణువణువున నింపి
'షాహ'పురాన రాతికోటను నిర్మించినవాడు
అనుయాయుల శౌర్య పరాక్రమాలు
తోడుగా నిలుపుకుని
గోల్కొండ కోటను ముట్టడించి
సింహాసనాన్ని అధిష్టించిన వాడు
సర్దార్ బిరుదాంకితుడై నవాబు నెదిరించినవాడు
ధైర్య సాహసాలకు నిలువెత్తు రూపమితడు
కష్టాలలో ఊరి, సాహసమై ఎగసి
కలల్ని అనుభవాలతో
పండించుకున్నవాడు.



– ఎస్.ఆర్.పృథ్వీ
9989223245



గాయని కేఎస్ చిత్రకు ఏఎన్ఆర్ స్వర్ణ కంకణ పురస్కారం అందజేస్తున్న మంత్రి హరీష్‌రావు, టీ. సుబ్బిరామిరెడ్డి, అక్కినేని కుమార్తె నాగ సుశీల, సాంస్కృతిక సంస్థ సంగమం నిర్వాహకుడు సంజయ్ కిశోర్ తదితరులు

# సంగీత విద్వాంసుడు జనార్ధన్ మిట్టాకు సన్మానం




ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటినరీహాల్‌లో ప్రముఖ సితార సంగీత వాయిద్య విద్వాంసుడు జనార్ధన్ మిట్టా శనివారం సంగీత ప్రియులను ఓలలాడించారు. ఎకనామిక్ కమిటీ ఆంధ్రప్రదేశ్, సురమండల్‌ల సంయుక్తాధ్వర్యంలో జనార్ధన్ మిట్టాకు జన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, ఎకనామిక్ కమిటీ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ప్రభా శంకర్, సురమండల్ అధ్యక్షుడు మోహన్ ఎంఆర్‌డీ. ఎకనామిక్ కమిటీ సొసైటీ ఉపాధ్యక్షుడు బి. శ్రీనివాస్‌రావు, ఉస్మానియా గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్, సొసైటీ సభ్యులు అశ్విన్ మార్గంలతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జనార్ధన్ మిట్టాకు సితార వాయిద్యంలో మంచి గుర్తింపు ఉందన్నారు. టీఆర్ఎస్ నాయకులు గోవింద్, మనోజ్‌కుమార్, దిలీప్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# సప్తస్వర గీతాలు మధురం



సప్తస్వర మౌలిక సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గాయకుడు మురళీధర్ బృందం గాయనీ గాయకులు–లక్ష్మి, ఉమ, సుజారమణ, వసంత లక్ష్మి, నాగమణి, రజని, పద్మ, కుమారిలక్ష్మి, సినీగీతాలను మధురంగా ఆలపించారు. డాక్టర్ జీ రాధారాణి, వైకే నాగేశ్వరరావు, సీఎల్ఎన్ గాంధీ, గంగాధర, కలగా కృష్ణ మోహన్, సాంబశివ, ఫణీందర్, చరణ్, అమరావతిరెడ్డి, రమణారావులు అతిథులుగా పాల్గొన్నారు. పీవీ శ్రీనివాస్ 99వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఈ విభావరి జరిగింది.



శ్రీ శారద మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో డా॥ అక్కినేని జయంతిని పురస్కరించుకుని ఆదివారం గానసభ ప్రధాన హాల్లో సినీ సంగీత విభావరి జరిగింది, తేట తేట తెలుగులా తెల్లవారి వెలుగులా– శీర్షికన ఈ కార్యక్రమం జరిగింది. డా॥ సముద్రాల వేణుగోపాలాచారి (ఢిల్లీ తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి), కే, క్రిష్ణారెడ్డిలు పాల్గొన్నారు. గాయనీ గాయకులు ఆలపించిన సినిమాపాటలు మధురంగా సాగాయి.

# కళాకారులకు గొంతెత్తే స్వేచ్ఛను కల్పించాలి




సభలో ప్రసంగిస్తున్న ఆచార్య జయధీర్ తిరుమలరావు

రాష్ట్రంలోని ప్రతి కళాకారుడికి గొంతెత్తి ఆడి, పాడే స్వేచ్ఛను కల్పించాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కళాకారులందరికీ ఉపాధి అవకాశాలను కల్పించి, గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. వారు కళా సాహిత్యం ప్రజల కోసం నిరంతరం నినదించాలని పిలుపు నిచ్చారు. శనివారం సాయంత్రం సుందరయ్య కళా నిలయంలో ప్రజా సాంస్కృతిక ఆవిర్భావ సభ జరిగింది. ఈ సందర్భంగా వర్ధమాన సాంస్కృతిక రంగం–సవాళ్లు పరిష్కార మార్గాలు అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాల పురిటిగడ్డ అన్నారు. ఇక్కడ ఆడే పాడే కళాకారుల సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు.

కళాకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. స్వపక్షం, ప్రతిపక్షం అని కవులు, కళాకారులపై వివక్ష చూపి వారిపై దాడులు, అక్రమ కేసులను బనాయించడం సరికాదన్నారు. సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ కళాకారులతో ప్రజాచైతన్యం సాధ్యమన్నారు. ప్రజాహక్కుల సాధనకు కవులు, కళాకారులు నినదిస్తూ పోరాటం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జెనిగ విష్ణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర సురేష్, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

## నేటినిజం

చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని 5 సం॥రాలకు రూ.700/–, 10 సం॥రాలకు రూ 1200/– మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి–74,
జవహర్‌నగర్,
హైదరాబాద్–500 020.

# నిజాలు!

అందుబాటుతో...అలుసైపోము
అందీ ..అందకుంటేనే..అందమూ ఆనందమూ.

ఎడారిలోని ఒయాసిస్సుగా
చీకట్లు కమ్మినపుడే ....మారు ఓ ఉషస్సుగా.

ప్రేమ పెళ్ళి.,పర్యవసానం
పెద్దల క్రౌర్యమో.,స్వయంకృతాపరాధమో

సృష్టిలో అందవికారం లేదు
బహుముఖ అందం,హృదయ చక్షుల సాక్షిగా.

అందాన్ని నిర్వచించలేం
అనుభూతులు హృదయగతాలు

జీవితం .....జీవించడానికే
మనకోసమే...కాదు..మందికోసం కూడా



–గొల్లపెల్లి రాంకిషన్
9849693324.



# చైతన్యవ్యాప్తికి చేయూతనిచ్చిన బుర్రకథ



‘సంగరం రంగ విహారా ధీరా! శాత్రవ సంహారా!’ ... మైకు గుండా ప్రవహించిన వీర రసం ప్రేక్షకుల మెదళ్లలోకి ఇంకిపోయి, చేతులపై వెంట్రుకలను నిక్కబొడుచుకునేలా చేస్తోంది. రంగస్థలంపై కథకుడు వేగంగా అటూ ఇటూ కదులుతూ, ఎగిరి గంతులు వేస్తూ, కాళ్ల గజ్జెలతో శబ్దం చేస్తూ, రణస్థలి వాతావరణాన్ని సృష్టిస్తూ ‘అది రంగస్థలమా? కదనక్షేత్రమా?’ అనే సంశయంలో ప్రేక్షకులు మునిగిపోయేలా చేస్తున్నారు. సౌండ్ బాక్స్‌ల నుండి వినిపిస్తోన్న ఉరుములకు తోడు కథకుడు కదులుతున్నప్పుడల్లా అతడు ధరించిన దుస్తులపై, చేతి గుడ్డపై, తంబురాపై పడి పరావర్తనమైన కాంతి మెరుపులను తలపిస్తోంది. అతనికి తోడుగా మరో ఇద్దరు ‘భళా భళి.. అరరెరె..’ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనిస్తూ పిడుగులు కురిపిస్తోన్న తీరు సభికులను ఉద్రేకపరుస్తోంది. ఆ విధంగా ఒకపరి ఆవేశం, ఒకపరి ఆలోచన, ఒకపరి ఆమోదం, ఒకపరి ఆవేదన కలిగిస్తోన్న ఆ కళారూపం బుర్రకథ.

ప్రదర్శనాకళల్లో ప్రచార ప్రబోధాలకు సాధనంగా విస్తృతంగా ఉపయోగపడే జానపద కళారూపం బుర్రకథ. పల్లె పదాలను, వంతగాళ్ల అప్రస్తుత ప్రస్తావనలను, హాస్యాలను, బిగువైన కథనాన్ని, పద్యాలను, పాటలను, ఉపకథలను ఇముడ్చుకున్న సరదా కళారూపం బుర్రకథ. పరిమితమైన ఆహార్యంతో, ఆటపాటలతో, హాస్యోక్తులతో సామాన్యజనానికి చేరువగా వెళ్లగలిగే కళారూపమిది. వీరగాథలను, త్యాగమూర్తుల కథలను, దేవతాకథలను, పౌరాణికాలను, జానపదాలను, రాజకీయాలను, సంక్షేమ అంశాలను ఇతివృత్తాలుగా చేర్చుకున్నదీ కళారూపం.

బుర్రకథ వివిధ కళారూపాలను తనలో అంతర్భాగంగా కలిగిఉంది. సంగీతం, సాహిత్యం, నృత్యం, వాద్యం, శిల్పం, తాళం, లయ, అభినయం, ఆహార్యం మొదలైనవన్నీ బుర్రకథలో అంతర్భాగాలుగా ఉంటాయి. వీర, హాస్య, కరుణ రసాలు ప్రధానంగా ఉండే ఈ కళారూపం నవరసాలూ మిళితమై ఉంటాయి. ప్రజానీకాన్ని జాగృతపరిచే మహత్తర శక్తి ఉన్న కళారూపం బుర్రకథ. తెలుగు జాతి జానపద, సంగీత కళారూపంగా బుర్రకథను పేర్కొనవచ్చు.

ఒకవైపు వామపక్షవాదులు, మరోవైపు జాతీయవాదులు కూడా ఈ కళారూపాన్ని వారి ప్రచారంలో విరివిగా వాడుకోవడం విశేషం.

బుర్రకథను ముగ్గురు ప్రదర్శకులతో నిర్వహిస్తారు. వారిని కథ, రాజకీయం, హాస్యం అనే పేర్లతో పిలుస్తారు. మధ్యలో కథకుడు ఉంటాడు. కథకుడి పాటకు, చెప్పే విషయానికి పక్కన ఉన్న ఇద్దరూ ‘తందాన తానా’ అంటూ వంత పాడుతారు.

బుర్రకథలో ప్రధాన కళాకారుడు కథకుడు. కథను చెప్పడం అతని ప్రధాన లక్ష్యం. అందువల్ల పక్కవాళ్ల కబుర్లతో కథ పక్కదారి పడితే తిరిగి ట్రాక్‌పైకి రప్పించడం, నిబ్ధతతో కథ చెప్పడం అతని విధులు. కథను సంబంధించిన వర్ణనలను, నీతిని, వ్యాఖ్యలను వచనంగా చెబుతూ సందర్భానుసారం భావస్ఫూర్తిని కలిగించేందుకు పాటలు పాడుతాడు. కథకుడు హాస్యమాడడం అరుదుగా ఉంటుంది. కథను నేర్పుగా చెప్పవలసి ఉన్నందువల్ల, కథలో మధ్య మధ్య ఆటపాటలను జోడించవలసి రావడం వల్ల కథకుడికి మాట, ఆట, పాట బాగా తెలిసి ఉండాలి. కథకుడి వేషధారణ రంగుల అంగరఖా, తలపాగా, నడుముచుట్టూ గుడ్డ, ముత్యాల గొలుసు, కాలిగజ్జెలతో ఆకర్షణీయంగా ఉంటుంది. కథకుడికి ఇరువైపులా వంతగాళ్లు ఉంటారు.

ప్రధాన కథకుడికి కుడివైపు ఉండే వంతగాడిని ‘రాజకీయం’ అంటారు. ఈ వంతగాడు హాస్యగాడు కాదు. సీరియస్ చర్చలను కథకుడితో చేసేది ఇతనే. ‘ఆహా.. ఓహో’ అంటూ వంతపాడుతుంటాడు. కథ పక్కదారి పట్టకుండా, పట్టాలు తప్పకుండా చూసేది ఇతనే. కథ పక్కదారి పట్టిందని భావించనప్పుడల్లా ‘ఏమైంద’ని ప్రశ్నిస్తూ, తిరిగి కథలోకి వచ్చేందుకు తోడ్పడుతాడు. కథలో పట్టు నిలుపుతాడు. ఉత్సాహాన్ని, ఊపును అందిస్తాడు. రంగుల దుస్తులతో, విభూతి రేఖలతో, చేతిలో డప్పులతో ప్రధాన కథకుడికి పాటలోను, చిందులోను తోడుగా నిలుస్తాడు. ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతుంటాడు. మూడో వ్యక్తి హాస్యం చేసినప్పుడు అతడితో చర్చిస్తాడు. వీరిద్దరూ ముందుకు వచ్చి, చర్చలు జరిపే సందర్భంలో ప్రధాన కథకుడు వెనక్కి వెళ్తాడు. ఇద్దరూ సరదా సంగతులను చర్చించిన అనంతరం ప్రధాన కథకుడు మళ్ళీ ముందుకు వచ్చిన కథనాన్ని కొనసాగిస్తాడు. మూడో వ్యక్తి హాస్యం చేసినప్పుడు ఇతను హాస్యగాడితో చర్చిస్తాడే తప్ప హాస్యం పంచడం ఇతని విధి కాదు. ప్రధాన కథకుడికి అండగా ఉండి కథ సాఫీగా సాగేలా చేయడం ఇతని ప్రధాన బాధ్యత.

మూడో వ్యక్తి హాస్యం. కథ సీరియస్‌గా సాగుతూ ఉంటే ప్రేక్షకులకు విసుగొస్తుంది కాబట్టి ఆ విసుగును పోగొట్టి హాస్యం పంచడం ఈ వంతగాడి ప్రధాన విధి. అవకాశం ఉన్నప్పుడల్లా హాస్యం పంచేందుకు ఇతను ప్రయత్నిస్తాడు. నిత్యజీవిత సందర్భాలకు తగ్గట్టుగా హాస్యంలో ముంచెత్తుతాడు. అయితే హాస్యం మత్తులో ప్రధాన కథ జిగిబిగిని కోల్పోయే సందర్భాల్లో ప్రధాన కథకుడు తిరిగి కథలను ప్రజల్లోకి తీసుకువెళ్తాడు.

బుర్రకథలో ప్రధాన కథకుడు గంభీరంగా కథనం చెప్తాడు. తంబురాను ధరించి, శృతిని మీటుకుంటూ, చేతి అందెలతో తాళం వేస్తూ, నృత్యం చేస్తూ, కథను చెప్తూ ఉంటాడు. హాస్య వంతగాడు ప్రజలకు వినోదం పంచుతాడు. ప్రేక్షకులకు కలిగే సంశయాలను కథకుడిని ప్రశ్నించి, సున్నిత హాస్యంతో ప్రజలకు సంతోషం కలిగిస్తాడు. వీరిరువురినీ బ్యాలెన్స్ చేస్తూ, ఒకవైపు హాస్యగాడికి సహాయ పడుతూ, అతనితో చర్చించడమే కాకుండా మరోవైపు కథాకథనానికి సహాయం చేయడం, ప్రదర్శనను సమతౌల్యం చేయడం రాజకీయం చేయవలసిన పని. ప్రధాన కథకుడి చేతిలో తంబురా ఉంటుంది. వంతగాళ్లిద్దరి చేతుల్లో గుమ్మెట్లు ఉంటాయి. వాటినే బుర్రలు అని, డక్కీలు అని, డిక్కీలు అని కూడా అంటారు. వంతగాళ్ల ‘భళానోయి భాయి తమ్ముడా! మేలు భళానోయి దాదానా!’ మొదలైన వాక్యాలతో వంత పాడుతారు. ‘వినరా భారత వీర కుమారా! విజయ గాథ నేడు!’, ‘వినరా భారత వీర కుమారా! విజయం మనదేరా!’ మొదలైన చరణాలు సర్వసాధారణంగా బుర్రకథలో విన్పిస్తాయి.

జంగం కథ, పంబల కథ, జముకుల కథ, పిచ్చుకుంట్ల కథ తర్వాత దాదాపు అదే రూపంలో జనబాహుళ్యంలోకి వచ్చింది బుర్రకథ. ఒకప్పుడు జంగం కథగా వర్ధిల్లిన కళారూపమే నేడు బుర్రకథగా మారిందని తెలుస్తోంది. దీన్నే తంబురా కథ అని, తందాన కథ అని, గుమ్మెట్ల కథ అని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తున్నారు.

బుర్రకథ కళారూపం మహారాష్ట్ర నుండి వచ్చిందనే వాదన కూడా ఉంది. తూర్పు కోస్తా ప్రాంతాన్ని చాళుక్య రాజులు పరిపాలించిన కాలంలో పశ్చిమ ప్రాంతం నుండి ఆ రాజులతో పాటే బుర్రకథ కూడా వలస వచ్చిందని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అభిప్రాయంతో ప్రముఖ తెలుగు రచయిత తిరుమల రామచంద్ర విభేదించారు. ఈ కళారూపం అచ్చంగా తెలుగువారికి సొంతమని ‘జయంతి’ పత్రికలో ఆయన పేర్కొన్నారు.

– డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు
9441046839



మహారాష్ట్ర కళారూపం పవాడా, మహారాష్ట్రతో పాటు కర్ణాటకలోనూ ప్రాచుర్యంలో ఉన్న కళారూపం లావణీలతో బుర్రకథకు చాలా భేదాలున్నాయని ఆయన నిరూపించారు.

వీరరస ప్రధానమైన పవాడాలో బుర్రకథలా అభినయం, నిలబడి నృత్యం చేయడం ఉండవు. వెనుక వంతదార్లు ‘దీదీ .. దీదీ’ అంటూ వంత రాగాలు పాడుతారు. కన్నడలో ప్రాచుర్యంలో ఉన్న లావణీలో అసలు వంతపాటే ఉండదు. ఒక్కరు గాని, ఇద్దరు గాని నిలబడి పాడుతారు. మహారాష్ట్రలో లావణీ కళారూపంలో కొద్దిగా మార్పు ఉంటుంది. దాంట్లో మహిళలు చేతులు తిప్పడం మొదలైన ఆంగికాభినయం ఉన్నప్పటికీ కథ చెప్పడం ఉండదు. అందువల్ల బుర్రకథ మహారాష్ట్ర నుండో కర్ణాటక నుండో దిగుమతి కాలేదని, అచ్చమైన తెలుగు జాతి కళారూపమని తెలుస్తోంది. ప్రాచీన కళారూపాలైన యక్షగాన, వీధి నాటకాలకు ఒక రూపం బుర్రకాథ కావచ్చని; శ్రీనాథునికి పూర్వ కాలం నుండే బుర్రకథ వంటిది ఉండేదనేందుకు క్రీడాభిరామంలోని పద్యాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు తిరుమల రామచంద్ర. వంతగాళ్లు వాయించే డక్కీలు పూర్వ కాలం నుండి ఉన్నవనేందుకు కాశీఖండంలో శ్రీనాథుడు రాసిన ‘పల్లకి చక్కి కాహళము వంశము దక్క హుడుక్క ఝుర్ఝురుల్/ ఝుల్లని యాదిగా గలుగు శబ్ద పరంపర తాళ శబ్దమై’ అనే పద్యాన్ని చరిత్రకారులు ఉదహరిస్తున్నారు. దీని నుండి బుర్రకథ అనాదిగా తెలుగునాట వ్యాప్తిలో ఉన్న కళారూపమని తెలుస్తోంది.

బొబ్బిలి యుద్ధం, పల్నాటి వీర చరిత్ర మొదలైన చారిత్రక యుద్ధగాథలు బుర్రకథలుగా వచ్చాయి. ఉత్తర గోగ్రహణం, వామన విజయం, దేవయాని చరిత్ర, అంబరీషోపాఖ్యానం మొదలైన భారత రామాయణ గాథలతో పాటు బాలనాగమ్మ, కామమ్మ, చిన్నమ్మ, లక్ష్మమ్మ, జానకీవాసం మొదలైన వాటిని కూడా బుర్రకథలుగా ప్రజలు ఆదరించారు. దేశభక్తిని రేకెత్తించేవిధంగా జాతీయ నాయకుల గాథలతో పాటు కష్ట జీవుల కన్నీటి వెతలను కూడా బుర్రకథలుగా ప్రదర్శిస్తున్నారు.

బుర్రకథలో విశేష కృషి చేసినవారు సుద్దాల హనుమంతు, షేక్ నాజర్, సుంకర సత్యనారాయణ, పట్నంశెట్టి ఉమామహేశ్వరరావు, దార అప్పల నారాయణ, పెండ్యాల వెంకటేశ్వర రావు, పరుచూరి రామకోటయ్య, సిరివిశెట్టి సుబ్బారావు, ప్రమీల సిస్టర్స్, కోసూరి పున్నయ్య, గోవర్ధన్, కాకుమాను సుబ్బారావు, దావులూరు, చింతల సూర్యనారాయణ, మోటూరి ఉదయం, చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి లక్ష్మి మొదలైనవారు. వారిలో సుద్దాల హనుమంతు బుర్రకథను తెలుగునాట అనేకచోట్ల ప్రజల్లో చైతన్యవ్యాప్తికి బుర్రకథను ప్రదర్శించారు. షేక్ నాజర్ బుర్రకథకు విశేష ప్రాచుర్యం తీసుకువచ్చారు. పద్మశ్రీ పురస్కారాన్ని పొందారు. బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, పల్నాటి యుద్ధం, బెంగాల్ కరువు మొదలైన అంశాలతో బుర్రకథలు చెప్పి మెప్పించారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా పల్లెల్లో బుర్రకథలతో ప్రజా సమస్యలపై గళమెత్తారు. నాజర్‌తో పాటు మోటూరి ఉదయం, కొండేపూడి రాధ, సబ్బి కనకారావు, గుడివాడ రాఘవులు మొదలైనవారు ప్రజానాట్యమండలి బ్యానర్‌పై బుర్రకథలను ప్రదర్శించారు. వింజమూరి లక్ష్మణరావు, డాక్టర్ మిక్కిలినేని, పురుషోత్తం, రాజబాబు, చక్కా సూర్యనారాయణ, చదలవాడ కుటుంబరావు మొదలైనవారు వంతగాళ్లుగా ప్రఖ్యాతి పొందారు.

సాంప్రదాయిక వాద్యాలతో పాటు హార్మోనియం, తబలా మొదలైన వాద్యాలను బుర్రకథలో ప్రవేశపెట్టి కథలు చెప్పినవారిలో నిడదవోలు అచ్యుతరామయ్య, సుంకర కృష్ణ, మాధవరావు, కప్పగంతుల రామం మొదలైనవారు ప్రముఖులు. బుర్రకథలను రాసి, మెప్పించినవారిలో సుద్దాల హనుమంతు, షేక్ నాజర్, వానమామలై వరదాచార్యులు, మాచిరాజు లక్ష్మీపతి, కొసరాజు రాఘవయ్య చౌదరి, రుక్మాభట్ల విధుమౌళి శర్మ, నీలా జంగయ్య, సుంకర సత్యనారాయణ, కాకుమాను సుబ్బారావు మొదలైనవారిని ప్రధానంగా పేర్కొనవచ్చు.

ప్రజలను చైతన్యవంతులను చేయడంలో, దేశభక్తిని ప్రేరేపించడంలో, ఉద్యమోన్ముఖులను చేయడంలో బుర్రకథ పోషించిన పాత్ర విశిష్టమైంది.



మొదటిరోజు శుక్రవారం జ్యోతి వెలిగిస్తున్న రోశయ్య. చిత్రంలో సుద్దాల అశోక్‌తేజ, కళా జనార్ధనమూర్తి, బండిరాజుల శంకర్ తదితరులు

# త్యాగరాయ గానసభలో ప్రజారంజకంగా సాగిన “బుర్రకథా సప్తాహం”



రెండవ రోజు శనివారం గుమ్మడిపల్లి సైదులును సత్కరిస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు, కళాజనార్ధనమూర్తి, బైస దేవదాసు, శ్రీనివాస్ తదితరులు.



మూడవ రోజు ఆదివారం ఆకుల శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, డా॥ ఓలేటి పార్వతీశం, కళా జనార్ధనమూర్తి, మహ్మద్ రఫీ, వై.రాజేంద్రప్రసాద్ తదితరులు.



4వ రోజు సోమవారంతాడూరి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న తెలంగాణ గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షులు ఆయాచితం శ్రీధర్, కళా వీఎస్. జనార్ధనమూర్తి, కిన్నెర రఘురాం తదితరులు.

తెలుగునాట జానపద వినోదగాన ప్రక్రియలలో ప్రబోధానికీ, ప్రచారానికీ సాధనంగా ఈ నాటికీ విస్తృతంగా ఉపయోగపడే కళారూపం బుర్ర కథ. కథకుని చేతిప్రక్రియ ఇది. ప్రదర్శన సౌలభ్యాన్ని బట్టి, వీర గాథలు, త్యాగమూర్తుల కథలు బుర్ర కథల ఇతివృత్తాలుగా బాగా పేరు గొన్నాయి. ఈ ప్రక్రియ ప్రచార సాధనంగా ఎంతగానో ఉపకరిస్తోంది. కుటంబ నియంత్రణ, రాజకీయ ప్రచారము, ప్రజలను విజ్ఞానవంతులను చేయడము వంటి కార్యక్రమాలలో ఇది బాగా వాడబడింది. జంగంకథ, పంబలకథ, జముకులకథ, పిచ్చుకుంట్ల కథ, తరువాత వచ్చింది. గతంలో నాజర్ బొబ్బిలియుద్ధం, అల్లూరి సీతారామరాజు ప్రహ్లాద, క్రీస్తు, పల్నాటి యుద్ధం బెంగాల్ కరువు వంటి వస్తు వైవిధ్యంగల కథలను చెప్పి రక్తికట్టించారు. ఇప్పటికీ ఆయన శిష్యులు బుర్రకథనే జీవనాధారం చేసుకొని బ్రతుకుతున్నారు. నాజర్ పల్నాటి యుద్ధం. బొబ్బిలియుద్ధం బహుళ ప్రచారం పొందినవి. కుమ్మరి మాస్టారుగా ప్రఖ్యాతి చెందిన దార్ల అప్పల నారాయణ. పెండ్యాల వెంకటేశ్వరరావు, పరుచూరి రామకోటయ్య, సిరివిశెట్టి సుబ్బారావు, ప్రమీల సిస్టర్స్, కోసూరి పున్నయ్య, గోవర్ధన, కాకుమాను సుబ్బారావు, దావులూరు, చింతల సూర్యనారాయణ, మోటూరి ఉదయం, చింతల కోటేశ్వరమ్మ, మహంకాళి లక్ష్మి తదితర కళాకారులు బుర్రకథలకు వన్నె తెచ్చారు.. బుర్ర కథల చరిత్ర ఇప్పటిది కానే కాదు. ప్రాచీనమైనా ఇంకా పల్లె పల్లెలోనూ సజీవంగా కదలాడుతూనే ఉంది. మరి నగరంలో బుర్రకథలు కనుమరుగయ్యాయా? అంటే లేదనే అంటున్నారు అనేక మంది ప్రముఖులు.

శ్రీ త్యాగరాయ గానసభ, కళాదీక్షితులు కళావేదిక, చిక్కడపల్లి వారి నిర్వహణలో సుద్దాల హనుమంతు గారి జ్ఞాపకార్థం **సెప్టెంబర్ 13వ తేదీ శుక్రవారం ప్రారంభమైన బుర్రకథా సప్తాహం 19 వ తేదీ వరకు** అంటే వారం రోజుల పాటు ఎంతో ఘనంగా జరిగింది. ఈ సప్తాహంలో శ్రీ బండిరాజుల శంకర్‌రాజు చే “ సీతాపరిత్యాగం” అనే అంశంపై బుర్రకథ అద్భుతంగా రక్తి కట్టింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తమిళనాడు మాజీ గవర్నర్ డా॥ కె. రోశయ్య మాట్లాడుతూ జానపద కళా ప్రదర్శన బుర్రకథకు పూర్వ ప్రాశస్త్యాన్ని, వైభవాన్ని చేకూర్చే ప్రయత్నం చేస్తున్న త్యాగరాయగానసభ అధ్యక్షులైన కళా వి.యస్. జనార్ధనమూర్తిని అభినందించారు. ఇలాంటి వారు ఉంటే చాలు కళలు సజీవంగా ఉంటాయని కొనియాడారు. అనంతరం బుర్రకథ కళాకారుడు శంకర్ రాజు మరియు వారి బృందాన్ని డా॥ రోశయ్య గారు ఘనంగా సత్కరించారు. విశిష్ట అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ సుద్దాల హనుమంతు ప్రజాకవి. జానపద కళా ప్రదర్శన బుర్రకథకు తెలంగాణ ప్రాంతంలో పితామహుడిగా పేరు పొందిన గొప్ప కళాకారుడు విశిష్ట వ్యక్తి సుద్దాల హనుమంతు అని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డా. విష్ణురావు, ప్రసిద్ధ రచయిత యు. రజనీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

**14వ తేదీ శనివారం** జరిగిన సప్తాహంలో గుమ్మడిపల్లి సైదులు గారిచే “దక్షయజ్ఞం బుర్ర కథ” వినిపించే కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు గారు గుమ్మడిపల్లి సైదులు గారిని, వారి బృందాన్ని ఘనంగా సన్మానించిన అనంతరం మాట్లాడుతూ.. ఇలా బుర్రకథలు నగరంలో ప్రదర్శింపజేయడం ఎంతో అభినందనీయం అని, అంతరించిపోతున్న ప్రాచీన కళలను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు ఇలా బుర్రకథల సప్తాహం కార్యక్రమం చేపట్టడం శుభకరమని, కళల వల్లే మన సంస్కృతి, సంప్రదాయాల విలువ తెలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు బైస దేవదాసు, సికా సంయుక్త కార్యదర్శి కొమ్ము వెంకట రమణ, గానసభ కమిటీ సభ్యులు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**15వ తేదీ ఆదివారం** జరిగిన ఆకుల శ్రీనివాస్ గౌడ్ గారిచే “వీరబ్రహ్మం గారి చరిత్ర” బుర్రకథ ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథిగా ఏపీ సాహిత్య అకాడమి అధ్యక్షులు పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ విచ్చేసి, మాట్లాడుతూ.. సమాజాన్ని చైతన్య పరచడంలో జానపద, సంప్రదాయం కళారూపాల్లో బుర్రకథకు ప్రత్యేక స్థానం ఉందని, ఈ కళ పండిత, పామరులకు సైతం జనరంజకమై ఆనందాన్ని ఇస్తుందని తెలియజేసారు. విశిష్ట అతిధులుగా డా॥ ఓలేటి పార్వతీశం మరియు మహ్మద్ రఫీ హాజరయ్యారు. ఈ సందర్భంగా బుర్రకథ కళాకారుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ గారిని, ఆయన సహాయకులు జయాచారి, ఆంజనేయాచారులను కొలకలూరి ఇనాక్ చేతులమీదుగా సత్కారం జరిగింది.



ఐదవ రోజు నక్క ఉప్పలయ్యను సత్కరిస్తున్న బి.సి.కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు, డా॥ ఏనుగు నర్సింహారెడ్డి, తదితరులు.



ఆరవ రోజు వెంకటేశాన్ని సన్మానిస్తున్న బుద్ధా మురళి, కళా వి.యస్. జనార్ధనమూర్తి, డా॥ వకుళాభరణం కృష్ణమోహన్, డా॥కొత్త కృష్ణవేణి, కొత్త శ్రీనివాస్, లక్కరాజు నిర్మల, వై. రాజేంద్రప్రసాద్, ఏభూషి యాదగిరితదితరులు.



చివరి రోజు శ్రీమతి కూకట్ల లలితను సత్కరిస్తున్న శంకర నారాయణ, న్యాయమూర్తి బుర్ర మధుసూదన్, డా॥ నాళేశ్వరం శంకరం, లయన్ విజయకుమార్, దైవజ్ఞశర్మ.

**16వ తేదీ సోమవారం** నాడు జరిగిన బుర్రకథా సప్తాహంలో తాడూరి శ్రీనివాస్ గారిచే “శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కథ” బుర్రకథ ప్రదర్శించబడింది. ఈ సప్తాహంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు అయాచితం శ్రీధర్ గారు పాల్గొని, మాట్లాడుతూ.. సుద్దాల హనుమంతు నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా సాగిన పోరులో క్రియాశీలక పాత్ర వహించి, చైతన్య పరచిన గొప్ప బుర్రకథా కళాకారుడని,ఆదరణ కోల్పోతున్న బుర్రకథను ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అనంతరం బుర్రకథకులు తాడూరి శ్రీనివాస్‌ను, అతని బృందాన్ని ఘనంగా సత్కరించారు. ఈ సభలో నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి, మద్దాలి రఘురామ్, వెంకట రమణ, చంద్రశేఖర్, లతావర్మ తదితరులు పాల్గొన్నారు.

**17వ తేదీ మంగళవారం** నాడు జరిగిన సప్తాహంలో నక్క ఉప్పలయ్య గారిచే సైదులు, వెంకన్న గారి సహ కళాకారుల సహకారంతో “సీతాకళ్యాణం బుర్రకథ” ఎంతో ప్రతిభావంతంగా ప్రదర్శించబడింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసి కమీషన్ ఛైర్మన్ మరియు ప్రముఖ సాహితీవేత్త బి.ఎస్ రాములు పాల్గొని మాట్లాడుతూ మానుకోటకు చెందిన ఈ కళాకారులు ఎంతో అభినందనీయులని, కారణ జన్ములని కొనియాడుతూ నక్క ఉప్పలయ్యగారికి, వారి బృందానికి ఘన సత్కారాన్ని అందించారు. విశిష్ట అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి పాల్గొని బుర్ర కథా వైశిష్ట్యాన్ని కొనియాడారు.

**18వ తేదీ బుధవారం** జరిగిన సప్తాహంలో గంథం వెంకటేశం గారిచే “బొబ్బిలి యుద్ధం” బుర్రకథ వారి బృంద సహకారంతో ఎంతో ఆకట్టుకునేలా జనరంజకంగా ప్రదర్శించబడింది. ఈ సప్తాహంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమీషనర్ బుద్దా మురళి పాల్గొని మాట్లాడుతూ.. బుర్రకథ కళారూపాన్ని ఆదరించి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా వుందని తెలిపారు. అతిథులుగా వివిధ రంగాల ప్రముఖులు డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, వై రాజేంద్రప్రసాద్, డా॥ కొత్త కృష్ణవేణి, కొత్త శ్రీనివాస్, యేబూషి యాదగిరి, లక్కరాజు నిర్మల హాజరయ్యారు. ఈ సందర్భంగా గంథం వెంకటేశం, రమేష్, గంగన్నలను ఘనంగా సత్కరించారు. అనంతరం సుద్దాల హనుమంతు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**19వ తేదీ గురువారం** నాడు జరిగిన ముగింపు సభలో జరిగిన సప్తాహంలో శ్రీమతి కూకట్ల లలిత గారిచే “పరిపూర్ణ బోధ సిద్ధాంతం” బుర్రకథ ఎంతో రమణీయంగా ప్రదర్శించబడింది. రాములమ్మ, సైదమ్మలు సహాయ సహకారాల్ని అందించారు. ఈ సప్తాహంలో అతిథులుగా రచయిత, పాత్రికేయలు, హాస్యబ్రహ్మ శంకరనారాయణ, మల్కాజ్‌గిరి కోర్టు న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్, లయన్ విజయకుమార్, ప్రముఖ కవి డా॥ నాళేశ్వరం శంకరం, ఆధ్యాత్మిక వక్త దైవజ్ఞశర్మ తదితరులు హాజరై కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ వారం రోజుల బుర్రకథా సప్తాహాన్ని పరిపూర్ణంగా విజయవంతం చేసిన కళాకారులకు త్యాగరాయ గానసభ అధ్యక్షులు శ్రీ కళా జనార్ధనమూర్తి అభినందనలు తెలిపారు.

# "అమ్మకు పర్యాయపదం అమ్మే"

## "అమ్మయాది" వార్షికోత్సవంలో డా॥ ఏనుగు నరసింహారెడ్డి

"అమ్మ' రెండు అక్షరాల పదబంధమే కావొచ్చు కానీ ఆ పదబంధ శక్తి అనిర్వచనీయమని, పేగు తెంపుకొని బిడ్డకు జన్మనివ్వడమే కాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఎదిగిస్తుందని ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. యదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రాహ్మణపల్లిలో జరిగిన 'అమ్మయాది' పెండెం ఫౌండేషన్ 8వ వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జన్మనిచ్చిన అమ్మను మరిచిపోకుండా ఆమె యాదిలో సాహిత్య, సాంస్కృతిక కళా విద్యా రంగాలలో విశేష సేవలు అందించిన, అందిస్తున్న వారిని పెండెం సత్యనా రాయణ, వారి సోదరులు గుర్తిస్తూ ఈ విధంగా పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ స్ఫూర్తి నలుగురు అనుసరించేలా ఉందన్నారు. ఎవరికి ఎందుకు సత్కారం చేస్తున్నామో బలంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒక వ్యక్తికి సన్మానం చేస్తున్నామంటే ఆ వ్యక్తి యొక్క ప్రత్యేకత ఏమిటీ, ప్రతిభ ఏమిటీ అన్న విషయాలు లోకానికి తెలియాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా అమ్మయాది సంస్థ గ్రామీణ కళాకారులను, కవులను గుర్తిస్తూనే రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభా మూర్తులను సత్కరించడం ఓ మంచి సంప్రదాయమన్నారు. భారతీయ, సంస్కృతీలో ఓ వైరుధ్య భావం స్త్రీ పట్ల ఉందన్నారు. ఒకచోట స్త్రీలు పూజింపబడిన చోట దేవతలు సంచరిస్తారని చెబితే, మరోచోట స్త్రీకి ఎక్కువ స్వాతంత్ర్యం ఇవ్వకూడదని చెప్పారు. ఇలాంటి భిన్న ధోరణులు పోయి స్త్రీని సమున్నతంగా గౌరవించే సంప్రదాయం మన సమాజంలో రావాలని ఆకాంక్షించారు. మనిషి కేవలం సాధారణ జీవితానికి పరిమితం కాకుండా తనదంటూ ఒక ప్రత్యేకతను చాటుకోవాలన్నారు. అలాంటి మహనీయులే చరిత్రలో శిలాక్షరంగా నిలిచారన్నారు. ఇందుకు రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్, శరత్‌చంద్ర వంటి సంపన్న కుటుంబాల వ్యక్తులే ఉదాహరణగా నిలిచారన్నారు.సరిపోయేంత సంపద వాళ్ళ పూర్వీకులు కూడబెట్టినప్పటికీ తమదైన మార్గంలో పయనించి ఓ చరిత్రను సృష్టించారన్నారు. ఆ విధంగా ఈనాటి యువత వాళ్ళ జీవితచరిత్రలను అధ్యయనం చేస్తూ స్ఫూర్తి పొందాలని కోరారు.

సభా ప్రారంభకులుగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పెండెం సత్యనారాయణ తల్లితో ఉన్న ప్రేమకు గౌరవానికి ఈ కార్యక్రమం అద్దం పటుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎంత మంది ప్రాణత్యాగం చేశారో మనకు తెలిసిందేనని, అలాంటి త్యాగధనుల తల్లుల బాధ వెల కట్టలేనిదన్నారు. ఎందరో తల్లుల పేగుగోస ఫలితమే మనం సాధించుకున్న తెలంగాణ అని అన్నారు. అమ్మను గుర్తు చేసుకోవడమంటే మనిషిలోని మానవత్వం తొంగిచూడటమే అన్నారు.

సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ ప్రసంగిస్తూ ప్రకృతికి పర్యాయరూపం అమ్మ అని, అమ్మ లేకుండా సమస్త సృష్టి శూన్యమన్నారు. అమ్మగా, అక్కగా, చెల్లిగా బహుపాత్రలను పోషిస్తూ సమాజ చైతన్యానికి ఆలంబనగా నిలుస్తున్న స్త్రీ మూర్తుల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. ఎదిగి వచ్చిన బిడ్డలు తమ తల్లిదండ్రుల పేరు చిరస్థాయిగా నిలిచేలా ఏదో ఒక రూపంలో కన్నరుణం తీర్చుకోవాలన్నారు.

జీవన సాఫల్య పురస్కారం స్వీకరించిన 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ నాగరిక సమాజంలో వృద్ధాశ్రమాలు పెరగడం ఏ దిశగా మనం ప్రయాణిస్తున్నామో అర్థం చేసుకోవాల్సిన సందర్భం ఆసన్నమైందని అన్నారు. మానవ సంబంధాలు మృగ్యమై వ్యక్తికి వ్యక్తికి మధ్య పూడ్చలేని అగాధం ఏర్పడుతుందన్నారు. తమ బిడ్డల కోసం ఆరుగాలం శ్రమించి ఆస్తిపాస్తులను కూడబెడితే వృద్ధాప్యంలో ఇంటి నుంచి గెంటివేస్తున్న కొడుకులను, కోడళ్ళను చూస్తుంటే బాధ కలుగుతుందన్నారు. పెండెం సోదరులు అలా కాకుండా బ్రతికినంత కాలం తమ అమ్మను జాగ్రత్తగా చూసుకోవడమే కాకుండా, ఆమె మరణాంతరం కూడా బ్రతికి ఉండేలా ఆమె పేరిట పురస్కారాలు అందజేయడం నిజంగా అభినందనీయమన్నారు.

ఈ సందర్భంగా సాహిత్య రంగంలో భువనగిరికి చెందిన మెరుగు వెంకటదాసుకు, వరంగల్‌కు చెందిన గోపగాని రవీందర్‌కు, మోత్కూరుకు చెందిన దేవినేని అరవింద రాయుడులకు సాహిత్య పురస్కారాలను కుందయ్యకు గురు సత్కారం, బత్తిని భిక్షపతి, అండెం వెంకటరెడ్డి, గూడ రాజబోసు, సీత దామోదర్, తిరువీధి ప్రభాకర్‌లను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరించారు. ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకులు శ్రీ రామోజు హరగోపాల్, గుండాల ఎంపిపి తాండ్ర అమరావతి, జడ్‌పిటీసీ కోలుకొండ లక్ష్మి, గ్రామ సర్పంచ్ బండారు సంధ్య, గ్రామ ఎంపిటీసి పాయిలి కవిత, నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు నెల్లుట్ల రవీందర్ రావు, ప్రముఖ హోమియో వైద్యులు డా॥ వాకిటి రాంరెడ్డి, అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమ సమన్వయకర్తగా తేజా ఆర్ట్ క్రియేషన్స్ అధ్యక్షుడు డా॥ పోరెడ్డి రంగయ్య వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో డా॥పోరెడ్డికి సభా సమ్రాట్ బిరుదును ప్రదానం చేశారు. ప్రముఖ గాయకులు సుద్దాల ప్రభాకర్‌తేజ, రాపోలు అశోక్ పాడిన పాటలు అలరించాయి. కార్యక్రమంలో పెండెం లక్ష్మి, రామచందర్, పరంధాములు, జిరసం సభ్యులు, ప్రజాభారతి సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

-పి. రాజేశ్వరి



సభలో ప్రసంగిస్తున్న ముఖ్య అతిథి సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ఏనుగు నరసింహారెడ్డి.



బైస దేవదాసుకు "జీవన సాఫల్య పురస్కారం" అందజేస్తున్న అతిథులు.



సభలో ప్రసంగిస్తున్న సభాధ్యక్షుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సుద్దాల సుధాకర్ తేజ.



పురస్కార గ్రహీత కవి మెరుగు వెంకట దాసు



విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బత్తిని భిక్షపతి



గేజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అండెం వెంకట రెడ్డి



కవి గోపగాని రవీందర్.



కవి దేవినేని అరవింద రాయుడు



రిటైర్డ్ ఉపాధ్యాయుడు కుందయ్య.



ప్రధానోపాధ్యాయుడు గూడ రాజగౌడ్



హిందీ పండిట్ సీత దామోదర్.



డా॥పోరెడ్డి రంగయ్యకు 'సభా సమ్రాట్'బిరుదును ప్రదానం చేసిన అతిథులు.

# ప్రజలిచ్చే అవార్డులే ఎంతో గొప్పవి-బి. నరసింగరావు

ప్రజలిచ్చే అవార్డే ఎంతో గొప్పదని ప్రముఖ సినీ దర్శకుడు కవి, చిత్రకారుడు బి.నరసింగరావు అన్నారు. సెప్టెంబర్ 15 ఆదివారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జరిగిన ఉదారి నాగదాసు స్మారక సాహిత్య పురస్కార ప్రధా నోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసగించారు.

ప్రజలు ప్రజా సంస్థలు ఇచ్చే ఏ అవార్డులైనా నిజాయితిగా నిష్పక్షపాతంగా ఉంటాయని, ప్రభుత్వం ఇచ్చే పురస్కారాలు కూడా ప్రజలు పన్నుల రూపంగా కట్టే డబ్బేనని అన్నారు. ఉదారి నాగదాసు స్మారక సాహిత్య పురస్కారం ఈ సం॥ 5000/- నగదు ప్రశంసా పత్రంతో అన్నవరం దేవేందర్‌కు అవార్డును అందజేశారు. దీనిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేస్తున్న ఉదారి కుటుంబ సభ్యులను మనస్ఫూర్తిగా అభినంది స్తున్నానన్నారు. మొదటి సారిగా అన్నవరం దేవేందర్ ఈ అవార్డును అందుకోవడం చాలా సంతోషాన్నిస్తుందని అన్నారు.

విశిష్ట అతిథిగా వచ్చిన ప్రముఖ కవి డా॥ చెమన్ సింగ్ గత 20 సం॥రాల నుంచి ఉదారి నాగదాసు స్మారక సాహిత్య పురస్కారం యువ కవులకు కవితల పోటీలు నిర్వహించడం చాలా సాహసమన్నారు. క్రమం తప్పకుండా ఈ సం॥ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. అవార్డులు కవులకు రావడం కొంత ప్రోత్సాహాన్ని కలిగిస్తుందని ప్రజా రచయితలకు బాధ్యతను పెంచుతుందని అన్నారు. ఈ అవార్డు అన్నవరంకు రావడం న్యాయబద్ధమ న్నాడు. న్యాయ నిర్ణేతలైన గుడిపాటి, థింసా, నారాయణ శర్మలకు ఉదారి కుటుంబం కృతజ్ఞతలు తెలియజేసింది.

ఇదే కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజోజు నాగభూషణం మాట్లాడుతూ ఆ కాలంలో నాగదాసు అచల పరిపూర్ణతత్వాన్ని తత్వాల రూపంగా ప్రచారం చేయడం ఎంతో గొప్పదన్నాడు. జగిత్యాల జిల్లాలోని రాఘవప ట్టణంలో రామసింహ కవికి వందేళ్ల కిందనే గుడి కట్టించారన్నారు. కవులను గౌరవించి తమ సంపదగా చూసుకోవడం తెలంగాణ ప్రజలకున్న ఉత్తమ సంస్కారమన్నాడు.

ఉదారి నాగదాసు పెద్ద కుమారుడు కృష్ణమాచార్యులు మాట్లాడుతూ తత్వ కవులు ఏ కులాలను, మతాలను ప్రోత్సహించలేదని, వీరి తత్వాలను దినమంతా కష్టపడి పని చేసే పేదలు, స్త్రీలు భజనల్లో పాడుకుంటారని అన్నారు. నాగదాసు తత్వాలు అన్ని కాలాలకు పనికొచ్చే విధంగా ఉన్నాయి కాబట్టె తెలంగాణ సాహిత్య అకాడమి వారు ముద్రించిన తెలంగాణ వాగ్గేయకారులు అనే పుస్తకంలో నాగదాసును వాగ్గేయకారునిగా పేర్కొనడం జరిగిందన్నారు.

'బండెనుక బండి గట్టి, పదహారు బండ్లు కట్టి', 'బద్రం కొడుకో కొమురన్నజర' లాంటి బి.నరసింగ రావు సినిమాల పాటలను బి.నారాయణ గౌడ్ పాడి సభికులను ఉత్తేజపరిచారు. నాగదాసు తత్వాల్లో శ్రమ జీవనం, శ్రామికవాదం ఉందన్నారు. ఆర్థిక దోపిడిని, సామాజిక వివక్షను ఖండించాడన్నాడు.

అవార్డు గ్రహిత అన్నవరం మాట్లాడుతూ కులాలు, మతాలు ప్రస్తుత సమాజాన్ని కల్లోల పరుస్తున్న తరుణంలో ఈ అచల పరిపూర్ణ సిద్ధాంతం అవసరం ఎంతో ఉందన్నారు. ఈ అవార్డు రావడం నాకెంతో ఆనందాన్ని కలిగించిదన్నారు. బాధ్యతను పెంచిందన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో కథారచయిత మన్నె ఏలియా మాట్లాడుతూ ఉదారి శేషన్న, రమేష్, నాగమ్మ, నర్సమ్మ, రాజు, గంగధర్, రమణ గౌడ్, కంది రామకృష్ణ మొ॥ గు వారిని సబికులు మెచ్చుకున్నారు. కవులు చిందం ఆశన్న, చరణ్‌దాస్, గడ్డం భీంరెడ్డి, మధుబాబు, మొ॥లగు వారిని ప్రేక్షకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమములో నగునూరి శేఖర్, కందుకూరి అంజయ్య, కూకట్ల తిరుపతి, బోర్ల వెంకటేశం, అన్నవరం శ్రీనివాస్, ఉదారి దయానంద్, ఉదారి నారాయణలు, కవీశ్వర చారి, తదితరులు పాల్గొన్నారు. సుమారు 200 మంది పాల్గొన్న సభకు ప్రముఖ కవి రచయిత జి. ఆర్.కుర్మె అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిని ఉదారి కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఉదారి కవిశ్వర చారి వందన సమర్పణతో ఈ కార్యక్రమము ముగిసింది. కురిమెల్లి లింగన్న, పి.లక్ష్మా రెడ్డి తదితరులు ప్రసంగించారు. తరువాత జరిగిన కవి సమ్మేళనంలో కవులు చదివిన కవితలు, గాయకులు పాడిన సామాజిక గీతాలు ప్రేక్షకుల్ని ముగ్దుల్ని చేశాయి. గాయకులు బోజ్జ ఆశన్న,







సభలో ప్రసంగిస్తున్న ఉదారి నారాయణ, బి.నరసింగరావు, అన్నవరం దేవేందర్ దంపతులకు 'జీవన సాఫల్య పురస్కారం' అందజేస్తున్న అతిథులు.

## కడారు మనో గీతికలు

ఉచితంగా దొరుకుతుందంటే
ఊరంతా పరుగెత్తకుండా ఉంటుందా?
ఉచితాల దండోరానే కదా
ఎన్నికల్లో మ్రోగించే పాంచజన్యం!

అజీర్ణమైందా
అది అనారోగ్యకారకం!
అహంకారం కళ్ళు కప్పితే
అధికార దుర్వినియోగం!

ఓల్డ్ ఏజ్ హోంలో తల్లిదండ్రులు
పిల్లలేమో డేకేర్ లో!
ఆఫీసుల్లో భార్యాభర్తలు
ఇదే కదా అమెరికాలో అందమైన బ్రతుకంటే!

సన్మానాలకు అలవాటు పడితే
సన్యాసులైనా శాలువాలతో సంతృప్తిపడరు!
ఎత్తుకోవడం అలవాటు జేస్తే
చంటోడైనా సంక దిగడు!

గెలిచినా, ఓడినా
తప్పదు సన్మానం!
గెలిస్తే పుష్ప గుచ్చాలతో
ఓడితే రాళ్ళతో!

పొరుగింటి పుల్లకూర
ఎంతో రుచి!
'మేడ్ ఇన్ జపాన్'
ఎగబడకుండా ఉంటారా?

కారణం ఏదైనా కావచ్చు
కార్చే కన్నీరెప్పుడూ ఉప్పే!
అక్కర ఏదైనా కావచ్చు
అప్పు ముప్పే!



-కడారు వీరారెడ్డి
సెల్: 9392447007

